విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729
ప్రశ్నించడం అందరి హక్కు...
# పెన్ సత్తా
PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :46 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 9 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03
Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## విద్యార్థుల కష్టానికి విలువే లేదు



- యూజీసీ-నెట్ అక్రమాలపై కేంద్రంపై రాహుల్ ధ్వజం
- యూజీసీ- నెట్ పరీక్షలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు
- లక్షలాది మంది విద్యార్థుల కష్టానికి ఫలితం లేకుండా పోతోందంటూ మండిపడ్డ రాహుల్
- రామాలయం ట్రస్ట్ సభ్యుల ఎంపికలో జరిగిన తప్పునకు మోదీ క్షమాపణ చెప్పాలన్న కాంగ్రెస్??

## తప్పులు సవరించుకున్న ఎన్‌సీఈఆర్‌టీ

- వివాదాస్పద భాగాల తొలగింపు
- దేశ విభజనపై కాంగ్రెస్ వైఖరి వక్రీకరణ?
- వివక్షకు కారణాల్లో ఆర్థిక వెనుకబాటూ జోడింపు!
- కొత్త పుస్తకంలో సంపూర్ణ స్వరాజ్యం డిమాండ్‌కు మరిన్ని వివరాలు జోడింపు

एन सी ई आर टी
NCERT
National Council Of Educational Research And Training

## కుల వృత్తుదారులకు ఆధునిక పరికరాలు

మంత్రులు ఎస్.సవిత, డోలా శ్రీ బాలవీరంజనేయ స్వామి

లెదర్ ఉత్పత్తులు కొనుగోలు చేసిన మంత్రులు




**అమరావతి**

కుల వృత్తుదారులకు ఆర్థిక భరోసా కల్పించేలా ఆధునిక పరికరాలను కూటమి ప్రభుత్వం అందజేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. చర్మకారుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక దష్టి సారించామని వారు పేర్కొన్నారు. ఏపి సచివాలయంలోని నాల్గవ భవనంలో లిడ్ క్యాప్ లెదర్ షోరూమ్(ఔట్ లెట్)ను మంత్రులు ఇరువురు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మీడియాతో మాట్లాడుతూ లిడ్ క్యాప్ ద్వారా చర్మకారుల అభివద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కషి చేస్తోందని మంత్రి బాల వీరాంజనేయస్వామి తెలిపారు. చర్మకారులకు ఉపాధి కల్పనకు మార్కాపురం జిల్లా యడవల్లి, కష్ణాజిల్లా

వివరాలు 2లో..



## ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా దేశ సాంస్కృతిక వారసత్వపు ఛాయలే

- ప్రధాని నరేంద్ర మోదీ
- వెయ్యేళ్ల పురాతన ప్రంబనన్ ఆలయానికి మోదీ
- త్రిమూర్తుల గుడిలో పూజలు- అద్భుతమంటూ కితాబు
- ఇండోనేసియాలో బిజీ బిజీగా గడుపుతున్న నరేంద్ర మోదీ
- 1000 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రంబనన్ ఆలయ సందర్శన

## రూ.100 కోట్లతో హాస్టళ్ల మరమ్మత్తులు



- హాస్టళ్లు, గురుకుల విద్యార్థులకు 10 శాతం డైట్ ఛార్జీల పెంపు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని మెరిట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు
- సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి**

హాస్టళ్లు, గురుకులాల స్కూళ్లను రూ.100 కోట్లతో మరమ్మత్తులు చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అదేవిధంగా ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతోన్న విద్యార్థులకు చెల్లించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని నిర్ణయించారు. సీఎం చంద్రబాబు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖలపై మంత్రులు, అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం ఇస్తున్న డైట్ ఛార్జీల్లో 10 శాతం పెంచాలని ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారుఈ సమీక్ష సందర్భంగా

వివరాలు 2లో..

## చంద్రబాబు ముందుచూపుకి నిదర్శనం

# పట్టిసీమ

- పట్టిసీమ ఒట్టిసీమ అన్న జగన్ ఏం సమాధానం చెబుతారు?
- కృష్ణా డెల్టాకు పట్టిసీమతో ఊపిరి
- సూపర్ ఎల్ నినోను సమర్థంగా ఎదుర్కొంటాం
- పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల ద్వారా నీటి విడుదల సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు



**ఏలూరు/తాడిపూడి**

పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే లోపు గోదావరి వృధా జలాలను కృష్ణ డెల్టాకు తరలించాలన్న ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన పట్టిసీమ ఎత్తిపోతల సత్ఫలితాలు ఇచ్చిందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. కేవలం రూ. 1300 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన పట్టిసీమ వల్ల వేల కోట్ల రూపాయల పంట పండిందన్నారు. బుధవారం ఏలూరు జిల్లా లో పట్టిసీమ, తూర్పు గోదావరి జిల్లా లో తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. పట్టిసీమ డెలివరీ పాయింట్, తాడిపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు దగ్గర గోదావరికి జలహారతి ఇచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను, కష్ణాజలాలతో అనుసంధానం చేసి, నదుల అనుసంధానానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నాడు పట్టిసీమ ఒట్టిసీమ

వివరాలు 2లో..




## మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్ రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్

- పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు ఫ్రీజ్
- కేర్‌వెల్ ఏవియేషన్ గ్రూప్‌తో లావాదేవీలపై దర్యాప్తు
- పార్టీ నిధులతో విమానం, హెలికాప్టర్ కొని లీజుకు తీసుకున్నట్లు ఆరోపణలు

## నాన్నా.. మీరే నా స్ఫూర్తి!.. మీ ఆశీస్సులే నా ధైర్యం!!



- వైఎస్సార్‌కు నివాళులర్పించిన మాజీ సీఎం జగన్
- రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ జయంతి వేడుకలు
- ప్రజాసేవ, సంక్షేమ పాలనకు చిరునామాగా నిలిచిన మహానేత వైయస్ఆర్ ఆశయాలు తనకు ఎల్లప్పుడూ మార్గదర్శం




## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు

- ఇథనాల్‌తో తనకు లాభం లేదన్న గడ్కరీ
- ఇథనాల్ ఉత్పత్తిలో తమ కంపెనీ వాటా కేవలం 0.07 శాతమేనని వెల్లడి
- ఆరోపణలను పూర్తిగా ఖండించిన కేంద్ర మంత్రి
- వాహనాలు దెబ్బతిన్నాయని ఆధారాలు చూపాలని సవాల్
- ఫిర్యాదులు వస్తే విచారణ చేస్తామని హామీ

# విద్యార్థుల కష్టానికి విలువే లేదు

కేంద్ర ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యూజీసీ- నెట్ పరీక్షలో అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలపై కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడ్డ దానికి ఫలితం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా కేంద్రం కళ్లు మూసుకుని హాయిగా నిద్రపోతోందని మండిపడ్డారు. 2026 జూన్?లో ఎన్?టీఏ నిర్వహించిన యూజీసీ- నెట్? పరీక్షపై హరియాణాలోని రోహ్తక్‌లో విద్యార్థి నాయకులు తీవ్రమైన ఆరోపణలు చేశారని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను ఆయన పంచుకున్నారు.



గత వారం జరిగిన యూజీసీ- నెట్ పరీక్షకు సంబంధించి వెలుగులోకి వచ్చిన తీవ్రమైన ఆరోపణలు పూర్తిగా విచారం కలిగిస్తున్నాయని రాహుల్? ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ అయిన కొద్ది వారాలకే, యూజీసీ- నెట్? పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్? కాపీ ఒకటి పంపిణీ జరిగినట్లు, అందులో దాదాపు 90 ప్రశ్నలు అసలైన ప్రశ్నాపత్రంతో సరిపోలుతున్నాయని కథనాలు వచ్చినట్లు ఆరోపించారు. కేవలం ఎన్?టీఏ వద్ద మాత్రమే అందుబాటులో ఉండే ఈ పీడీఎఫ్? ప్రశ్నాపత్రం బయటకు రావడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

"రాజస్థాన్, దిల్లీ, హరియాణా, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ ప్రశ్నాపత్రం రూ. 2.25లక్షలకు విక్రయించారు. అలాగే, సీఎస్?ఐఆర్?- నెట్?, హెచ్?టీఈటీ, ఏడీఏ వంటి రానున్న పరిక్షలకు కూడా ప్రశ్నాపత్రాలు అందుబాటులో ఉన్నట్లు ఆ ముఠా? పేర్కొంది. నీట్?, నెట్? పరీక్షల్లో వరుసగా కుంభకోణాలు జరుగుతున్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ విషయంపై, మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుంచి జవాబుదారీతనాన్ని లేదా తక్షణ చర్యను ఆశించడం వ్యర్థమని దేశం మొత్తానికి తెలుసు."

పరీక్షల అవకతవకల్లో మార్పు రావాలంటే కలిసికట్టుగా గొంతుకను వినిపించడమే ఏకైక మార్గమని రాహుల్? స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా వినిపించే విద్యార్థుల గర్జన, దేశంలో విద్యా విప్లవాన్ని తీసుకువస్తుందని ఆయన నొక్కి చెప్పారు. కాగా, ఈ ఆరోపణలపై ఎన్?టీఏ నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.

**ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి : జైరాం రమేశ్**

ఇదిలా ఉండగా, అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీ విషయంలో ఆలయ ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ బుధవారం డిమాండ్ చేసింది. అలాగే, ట్రస్ట్ సభ్యుల ఎంపికలో జరిగిన తప్పునకు గాను ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరింది. రామమందిర నిర్మాణ ఘనతను తమ ఖాతాలో వేసుకోవడంలో ముందున్న ప్రధాని, విరాళాల చోరీ బాధ్యతను స్వీకరించడానికి ఎందుకు వెనుకాడుతున్నారని కాంగ్రెస్ సీనియర్? నేత జైరాం రమేశ్? ప్రశ్నించారు. "ట్రస్ట్‌ను రద్దు చేసి, కొత్త ట్రస్ట్‌ను ఏర్పాటు చేయండి. అసలైన దోషులను అరెస్టు చేయండి. ఈ కేసును సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపండి. మోదీ మౌనాన్ని వీడండి" అంటూ రమేష్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. మరోవైపు, విరాళాల నిధులను ప్రజలకు అందుబాటులో ఉంచడంలో ట్రస్ట్ విఫలమైందని కాంగ్రెస్? పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ శక్తిసిన్హ్ గోహిల్ ఆరోపించారు. ఈ వ్యవహారం బయటపడకముందు రామాలయ రోజువారీ వసూళ్లు రూ.16 నుంచి 18 లక్షలుగా ఉండేదని, అయితే ఈ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చాక, రోజువారీ వసూళ్లు ఒక్కసారిగా రూ.24 నుంచి 26 లక్షలకు పెరిగాయని ఆయన ఆరోపించారు. దీనిని బట్టి చూస్తే అంతకుముందు రోజుకు దాదాపు రూ.10 లక్షల చొప్పున విరాళాల డబ్బు పక్కదారి పట్టిందనే అనుమానాలు రేకెత్తుతున్నాయని ఆయన తెలిపారు. రామమందిరం కోట్లాది మంది ప్రజల విశ్వాసానికి కేంద్రబిందువు అని, దానికి సంబంధించిన ఏవైనా ఆర్థిక అక్రమాలను సహించేది లేదని గోహిల్? నొక్కి చెప్పారు.

# తప్పులు సవరించుకున్న ఎన్‌సీఈఆర్‌టీ

**న్యూఢిల్లీ:** న్యాయవ్యవస్థపై ఆరోపణలతో వివాదాలకెక్కిన జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఎట్టకేలకు తన తప్పులను దిద్దుకుంది. తాజాగా విడు దల చేసిన ఎనిమిదవ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో వివాదాస్పద భాగాలను తొలగించింది. కాకపోతే కొత్త పుస్తకంలోనూ కొన్ని సవరణలు చేసింది. దేశ విభజన విషయంలో కాంగ్రెస్ వైఖరిని వక్రీకరించింది. వీర్ సావర్కర్ స్వరాజ్ కోసం డిమాండ్ చేశాడన్న విషయాన్ని జోడించింది. జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్, నాజీ సిద్ధాంతాల ప్రస్తావనను తొలగించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్‌సీఈఆర్‌టీ "ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్"పేరుతో విడుదల చేసిన పాఠ్యపుస్తకంపై పెద్ద ఎత్తున దుమారం రేగిన విషయం తెలిసిందే. ఇందులోని ఒక అధ్యాయనంలో న్యాయవ్యవస్థలో అవినీతి, పెండింగ్ కేసుల ప్రస్తావనలు ఉండటం వివాదాస్పదమైంది. సుప్రీంకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని పుస్తకాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. ఏ రకంగానూ ఈ వివాదాస్పద పుస్తకం మళ్లీ ముద్రించకుండా ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌సీఈఆర్‌టీ కూడా సుప్రీంకోర్టును క్షమాపణలు కోరింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనే ఆ పాఠ్యపుస్తకాన్ని సమీక్షించింది. సవరణలతో కూడిన పుస్తకం ఇటీవలే అందుబాటులోకి వచ్చింది.




**చేసిన మార్పులేమిటి?**

స్వాతంత్రోద్యమం, దేశ విభజనకు సంబంధించి ఈ పుస్తకంలో 'ఇండియాస్ లాంగ్‌రోడ్ టు ఇండిపెండెన్స్'పేరుతో ఒక అధ్యాయం ఉంది. అందులో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కూడా దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించినట్లుగా రాశారు. అలాగే స్వాతంత్ర్యం సంపాదించేందుకు దేశ విభజన ఒక్కటే మార్గమన్న విధానాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకోవడం చర్చనీయాంశమని కూడా ఉంది. విభజన సమయంలో భారత ఉపఖండంలో మతహింసలు చెలరేగగా కాంగ్రెస్ అసహాయ స్థితిలో ఉండిపోయిందన్న వ్యాఖ్యను తొలగించారు. హిందూ, ముస్లిం నేతల మధ్య ఉన్న అభిప్రాయభేదాలను తమకు అనుకూలంగా మార్చుకున్న బ్రిటిష్ పాలకులు దేశాన్ని విభజించాలని నిర్ణయించారని, మహాత్మగాంధీ సహా కాంగ్రెస్ నేతలు కూడా విభజనను వ్యతిరేకించారని, కానీ చివరకు ముందుకెళ్లేందుకు అదొక్కటే మార్గమని అంగీకరించారన్న విషయాలను కూడా కొత్త పుస్తకంలో చేర్చలేదు. కొత్త పుస్తకంలో సంపూర్ణ స్వరాజ్యం డిమాండ్‌కు మరిన్ని వివరాలు జోడిస్తూ... 1925లో వీర్ సావర్కర్ కూడా స్వరాజ్ కోసం డిమాండ్ చేసినట్టుగా రాశారు. ఫిబ్రవరిలో ప్రచురితమైన పుస్తకంలో స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ సాయుధ దళాన్ని అభివృద్ధి చేసేందుకు హిట్లర్ సాయం కోరినట్టు ఉంది. అలాగే హిట్లర్ నాజీ భావజాలం, విస్తరణవాదం ఫలితంగానే రెండో ప్రపంచయుద్ధం జరిగిందన్న వివరమూ కొత్త పుస్తకంలో లేకుండా చేశారు. సుభాష్ చంద్రబోస్ బ్రిటిష్ వ్యతిరేక శక్తుల సాయం కోరాడని మాత్రమే ఉంచారు. న్యాయవ్యవస్థకు సంబంధించిన 'ద రోల్ ఆఫ్ జ్యుడిషరీ ఇన్ సొసైటీ'లో వివాదాస్పద అంశాలను తొలగించిన ఎన్‌సీఈఆర్‌టీ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, ట్రైబ్యునల్స్, ప్రత్యామ్నాయ విభేద పరిష్కార పద్ధతుల సమాచారం జోడించింది. సమాజంలో వివక్షకు కులం, మతం, జాతి, లింగం, వైకల్యం, లైంగికతవి కారణమవుతున్నాయని ఫిబ్రవరిలో ప్రచురితమైన పుస్తకంలో ఉండగా కొత్తదాంట్లో "ఆర్థిక నేపథ్యం"అనే అంశాన్ని చేర్చారు. 'సిటిజన్‌షిప్: రైట్స్ అండ్ డ్యూటీస్'అన్న అధ్యాయంలో వివక్ష అనేది అనైతికమైంది మాత్రమే కాకుండా చట్టపరంగానూ నిషేధించిందని స్పష్టం చేశారు. ఆర్థికంగా వెనుకబడ్డ కుటుంబాల నుంచి వచ్చిన వారు కూడా వివక్ష ఎదుర్కొనే అవకాశం ఉందని చెప్పారు. ఇటీవల యూజీసీ 2026 సమానత నియమావళి పై జరిగిన చర్చలో ఆర్థిక వెనుకబడిన స్థితి స్పష్టంగా రక్షిత వర్గంగా పేర్కొనలేదన్న విమర్శల మధ్య ఈ మార్పునకు ప్రాధాన్యమేర్పడింది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రస్తావన పాఠ్యపుస్తకంలో, ఈ పుస్తకం సుప్రీం కోర్టు రిట్ పిటిషన్ (సివిల్) నెం: 1/2026 ద్వారా ఇచ్చిన ఆదేశాల మేరకు మళ్లీ ప్రచురించామని ఎన్‌సీఈఆర్‌టీ స్పష్టం చేసింది. కొత్త పుస్తకం తయారీలో పాల్గొన్న రచయితల సంఖ్య 51 నుంచి 48కి తగ్గింది.

# మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్: రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్

పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆ పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.440.42 కోట్ల నిధులు ఉన్నట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. ఏవియేషన్ రంగానికి చెందిన 'కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్'కు సంబంధించి జరుగుతున్న అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ సుదీర్ఘ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా పరిసర ప్రాంతాల్లోని ఐదు చోట్ల సోదాలు నిర్వహించిన అనంతరం ఈడీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈడీ ప్రాథమిక దర్యాప్తు వివరాలు ప్రకారం, ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2026 మధ్య కాలంలో టీఎంసీకి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ.160 కోట్లను కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేశారు. ఆ తర్వాత రూ.82.96 కోట్లను మరో కంపెనీకి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులతో రూ.112 కోట్ల వ్యయంతో ఒక ఎంబ్రేయర్ లీగసీ 600 విమానం, ఒక అగస్టా 109 ఎస్‌పీ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిని తిరిగి అధిక ధరకు టీఎంసీకే లీజుకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ లావాదేవీల తీరు అత్యంత అనుమానాస్పదంగా ఉందని, అసలు లబ్ధిదారులను గుర్తించకుండా నిధుల మళ్లింపును దాచిపెట్టేందుకే ఈ వ్యూహాన్ని అనుసరించినట్లు అధికారులు భావిస్తున్నారు. హెలికాప్టర్ కొనుగోలుకు విదేశీ నిధులు ఏమైనా వినియోగించారా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న టీఎంసీకి, ఈ తాజా పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నిధుల మూలాలపై ఆ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలు గతంలోనే పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.



## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు..

ఇథనాల్ ఇంధన విధానంపై వస్తున్న విమర్శలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తిప్పికొట్టారు. ఈ విధానం వల్ల తనకు ఎలాంటి వ్యక్తిగత లాభం లేదని స్పష్టం చేశారు. ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. 'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. తమ కుటుంబానికి చెందిన చక్కెర పరిశ్రమ ఇథనాల్ విధానం కంటే ముందే ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో తన వాటా కేవలం 0.07 శాతం మాత్రమేనని చెప్పారు. ఇంత చిన్న వాటాతో తనకు ఆర్థికంగా పెద్ద ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్నారు. ఇథనాల్ విధానాన్ని తన ప్రయోజనాల కోసం రూపొందించారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గడ్కరీ అన్నారు. దేశ ఇథనాల్ విధానాన్ని ఒక్క వ్యక్తి నిర్ణయించలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో సుమారు 550 యూనిట్ల ద్వారా ఏడాదికి దాదాపు 1,500 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. ఇథనాల్ మిశ్రమ విధానాన్ని తాను ఒక్కడే రూపొందించలేదని గడ్కరీ స్పష్టం చేశారు. పెట్రోలియం శాఖ, కేంద్ర మంత్రివర్గం, శాస్త్రీయ పరిశోధనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాను ఇథనాల్ గురించే కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ఎప్పటి నుంచో ప్రోత్సహిస్తున్నానన్నారు. దీని వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గడమే కాక రైతులకు కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్న వారిని గడ్కరీ ప్రశ్నించారు. నిజంగా అలాంటి ఘటన జరిగితే డీలర్‌తో పాటు తన శాఖకు కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇథనాల్ వల్ల వాహనం దెబ్బతిన్న ఇద్దరు వ్యక్తుల పేర్లు చెప్పగలరా అని కూడా ప్రశ్నించారు. మారుతీ సుజుకీ, టయోటా, టాటా మోటార్స్, మహీంద్రా వంటి సంస్థల నుంచి ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతిన్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని గడ్కరీ చెప్పారు. ఇటీవల టయోటా వాహనానికి సంబంధించిన ఘటనలో కూడా నీరు కలవడమే సమస్యకు కారణమని విచారణలో తేలిందన్నారు. కొత్త ఇంధన విధానానికి అనుమతి ఇచ్చే ముందు వాహనాలపై ఏళ్ల తరబడి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. తనపై బురదజల్లేందుకు, ఇథనాల్ విధానాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని గడ్కరీ ఆరోపించారు. అమెరికా, బ్రెజిల్, జపాన్, జర్మనీ, థాయ్‌లాండ్, స్వీడన్ వంటి దేశాల్లో కూడా ఇథనాల్ వినియోగం కొనసాగుతోందని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానం కొత్త ప్రయోగం కాదని, ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానమేనని స్పష్టం చేశారు.

## ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా దేశ సాంస్కృతిక వారసత్వపు ఛాయలే



భారత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో కలిసి దాదాపు 1,000 సంవత్సరాల పురాతన చారిత్రక ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించారు. త్రిమూర్తులైన శివుడు, విష్ణువు, బ్రహ్మలు కొలువైన ఈ గుడిలో మోదీ పూజలు చేశారు. అనంతరం ఇరు దేశాధినేతలు కలిసి ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రంబనన్ హిందూ దేవాలయాల సముదాయానికి సంబంధించిన అద్భుతమైన వైమానిక దృశ్యాలను (ఏరియల్ వ్యూ) 'ఎక్స్'లో షేర్ చేశారు మోదీ. ఈ యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడానికి 'అద్భుతమైన ప్రంబనన్ ఆలయం!' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ప్రధాని మోదీ ప్రంబనన్ ఆలయ సందర్శన ఈ విశాలమైన గుడి ప్రాంగణంలో భారత్ సాయంతో చేపట్టే పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి మార్గం సుగమం చేసింది. ఇది యాక్ట్ ఈస్ట్ పాలసీ కింద భారత సాంస్కృతిక దౌత్యంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఇదే ప్రాజెక్ట్‌పై ప్రధాని మోదీ, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రభోవోల మంగళవారం విస్తృత ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ పరిరక్షణ ప్రాజెక్ట్ కోసం ఇద్దరు నాయకులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ) పరస్పరం మార్చుకున్నారు. యోగ్యకార్తాలోని ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా అక్కడ భారతదేశ సాంస్కృతిక వారసత్వపు ఛాయలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆగ్నేయాసియాలో భారత వారసత్వానికి ప్రంబనన్ ఆలయం రెండో అతిపెద్ద గుర్తింపని తెలిపారు. ఈ ఆలయంలో శివుడు, దుర్గాదేవి, గణేషుడి విగ్రహాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ గుడిలో శతాబ్దాలుగా పూజలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈరోజు తాను కూడా ప్రంబనన్ ఆలయాన్ని దర్శించుకున్నానని చెప్పారు. అక్కడ పూజలు చేసే అవకాశం తనకు లభించిందన్నారు. గుడి పునరుద్ధరణ పనులు పూర్తైన తర్వాత తాను మళ్లీ ఈ గుడి వస్తానని వాగ్దానం చేశారు.

"నేను ఇండోనేసియా వచ్చి ఇది మూడో రోజు. అయినా ఇక్కడి సంభాషణల్లో, గాలిలో సాంస్కృతిక పరిమళం అలముకుంది. భారతదేశంలో మనం ప్రతి క్షణం అనుభవించే పరిమళం ఇది. ఈ సాంస్కృతిక వారసత్వ పరిమళం ఇరుదేశాల ప్రజలను ఒకరికొకర్ని అనుసంధానిస్తుంది. ఈ వారసత్వాన్ని పరిరక్షించిన ఇండోనేసియా ప్రజలకు, నాయకులకు ధన్యవాదాలు. ప్రంబనన్ గుడిలో పరమశివునితో అనుసంధానమయ్యే అవకాశం నాకు లభించడం నా అదృష్టం. హట్కేశ్వర్ మహాదేవ్ ఆలయం ఉన్న వాద్‌నగర్‌లో నేను జన్మించాను. సోమనాథ్ జ్యోతిర్లింగం ప్రపంచంలోనే మొదటి జ్యోతిర్లింగం. అది గుజరాత్‌లో ఉంది. నేను ఎంపీగా గెలుపొందిన నియోజకవర్గం వారణాసిలో కాశీ విశ్వనాథుడి ఆలయం ఉంది. ఆయన ఆశీస్సులు నాకు నిరంతరం లభిస్తున్నాయి. ప్రంబనన్ ఆలయ పునురుద్ధరణ పనులను ప్రారంభించే అవకాశం నాకు లభించింది. దీనిని నేను గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను." అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**గుడి చరిత్ర ఏంటంటే?**

జావా ద్వీపంలో ఉన్న ప్రంబనన్ ఆలయాన్ని 9వ శతాబ్దంలో నిర్మించారు. ఇది ఇండోనేసియాలో అతిపెద్ద హిందూ గుడి. కంబోడియాలో ఉన్న అంగ్‌కోర్‌వాట్ తర్వాత ఆగ్నేయాసియాలో ఇదే పెద్ద దేవాలయం. దాదాపు 40 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ గుడి ప్రాంగణంలో మొదట సుమారు 240 ఆలయాలు ఉండేవి. ఈ గుడి నిర్మాణాన్ని హిందూ మాతారామ్ రాజవంశానికి చెందిన రాజు రాకై పికాతన్ ప్రారంభించగా, ఆయన వారసుడు లోకపాల పూర్తి చేశారు. ఇక్కడి శివ, విష్ణు, బ్రహ్మ ఆలయాలలో 47 మీటర్ల ఎత్తున్న ప్రధాన శివాలయం అత్యంత ప్రముఖమైనది. ఈ ఆలయ గోడలపై చెక్కిన రామాయణ గాథ శిల్పాలు భారత్-ఇండోనేసియాల ప్రాచీన నాగరికత బంధానికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. ఈ గుడిని యూనెస్కో 1991లో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది.

**పర్యటనలో కీలక ఘట్టాలతో వీడియో**

మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ తన ఇండోనేసియా పర్యటనలో ముఖ్యాంశాలను ప్రదరిస్తూ ఓ వీడియోను పంచుకున్నారు. ఇండోనేసియాలో తనకు లభించిన ఘన స్వాగతం, ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, ప్రవాస భారతీయులతో తాను జరిపిన సమావేశాలలోని కీలక ఘట్టాలను ఆ వీడియోలో పొందుపర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించిన ఇండోనేసియా పిల్లలు భారత్, ఇండోనేసియా జెండాలను ఊపుతూ 'స్వాగతం మోదీజీ', 'ఐ లవ్ యూ మోదీజీ' అంటూ నినాదాలు చేస్తూ ప్రధానికి స్వాగతం పలకడంతో ఈ వీడియో ప్రారంభమైంది. జకార్తాలోని అధ్యక్ష భవనంలో ఘన స్వాగత కార్యక్రమం, గౌరవ వందనం, సైనిక కవాతు, ఇరు దేశాధినేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశాలు కూడా ఈ వీడియోలో ఉన్నాయి. అలాగే ఈ సమావేశాలు సందర్భంగా మోదీ చేసిన వ్యాఖ్యలను కూడా ఈ వీడియోలో ఉన్నాయి. కాగా, ఇండోనేషియా పర్యటన ముంగించుకున్న మోదీ, ఆస్ట్రేలియాకు బయలుదేరారు.

# సొంతిళ్లులా బీసీ గురుకులాలు, హాస్టళ్లు.





- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత.
- 10 శాతం డైట్ ఛార్జీల పెంపు, రూ.500 కోట్ల సాస్కి నిధుల కేటాయింపు పై హర్షం
- బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం.
- సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు.


**అమరావతి, పెన్ సత్తా, జులై 08:** అన్ని సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థుల డైట్ బిల్లులు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. ఎంజేపీ స్కూళ్ల శాశ్వత భవన నిర్మాణాలకు రూ.500 కోట్ల సాస్కి నిధులు మంజూరు చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీచేశారు. బీసీ బిడ్డల విద్య పట్ల సీఎం చంద్రబాబుకున్న చిత్తశుద్ధికి డైట్ ఛార్జీల పెంపుతో పాటు సాస్కి నిధులు మంజూరే నిదర్శనమన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి సవిత ఒక ప్రకటన చేశారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అన్ని సంక్షేమ శాఖ మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత మిస్తున్న డైట్ ఛార్జీలకు పది శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు కల్పించే ఉద్దేశంతో రూ.500 సాస్కి నిధులు జారీచేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. ఈ నిర్ణయాల పై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరల దృష్ట్యా అన్ని గురుకులాలు, హాస్టళ్లలో అమలవుతున్న పది శాతం డైట్ ఛార్జీలు పెంచాలని సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం వల్ల విద్యార్థులకు మరింత నాణ్య మైన పౌష్టికాహారం అందించే వీలుకలుగుతుందన్నారు. ముఖ్యంగా బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం రెండేళ్లలో వందల కోట్లు వెచ్చిస్తోందన్నారు. అధికారం లోకి రాగానే గత ప్రభుత్వం పెట్టిన రూ.110 కోట్ల డైట్ బిల్లులను చెల్లించిందన్నారు. ఎప్పటికప్పుడు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తూ వస్తోందన్నారు.

గురుకుల విద్యకు మరింత ప్రోత్సాహం.

ఎంజేపీ గురుకులాల అభ్యున్నతికి తమ అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. ఇటీవల ఆరు ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలను కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. కొత్తగా పది గురుకుల పాఠశాలలను మంజూరు చేశామన్నారు. ఇప్పుడు ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు కల్పించాలన్న లక్ష్యంతో రూ.500 కోట్ల సాస్కి నిధుల మంజూరుకు సీఎం చంద్రబాబు ఆదేశించడం ఆనందకర విషయమన్నారు. డైట్ ఛార్జీల పెంపుతో సాస్కి నిధులు మంజూరుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం పై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేస్తూ, బీసీ బిడ్డల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ గురుకులాల్లో సొంతింటి కంటే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నాణ్య మైన విద్యతో పాటు రుచికర మైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఎంజేపీ గురుకులాల్లో ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. బీసీ బిడ్డలు ఉన్నత చదువులు అభ్యసించేలా సీఎం చంద్రబాబు నాయుడు ఎన్ని కోట్లయినా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

# అంతర్జాతీయ విమానశ్రయానికి కట్టుదిట్ట మైన భద్రత కల్పిస్తాం.







- విశాఖపట్నం రేంజ్ ఐజిపి గోపీనాథ్ జట్టి.

**విజయనగరం, పెన్ సత్తా, జులై 08:** జిల్లా భోగాపురంలో నూతనంగా నిర్మించి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయంను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తో కలిసి విశాఖపట్నం రేంజ్ ఐజిపీ గోపీనాథ్ జట్టి సందర్శించి కట్టుదిట్ట మైన భద్రత కల్పించనున్నట్లుగా తెలిపారు. జిల్లా ఎస్పీ, విశాఖపట్నం రేంజ్ ఐజిపి, ఎయిర్ పోర్టు అధికారులతో కలిసి ఎయిర్ పోర్టును, ప్రాంగణంలో నిర్మించిన కమాండ్ కంట్రోల్, ఎ.టి.సి., బ్యాగేజ్, ఇతర లాంజ్ లను సందర్శించి, భద్రత ఏర్పాట్లును సమీక్షించారు. ఏ భవనంలో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించనున్నది ఎయిర్ పోర్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎయిర్ పోర్టు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పవర్ పాయింట్ ప్రెజెంటేషనుతో చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లును సమీక్షించారు.

ఈ సందర్భంగా ఐజిపి గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ – భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ త్వరలో ప్రారంభంకానున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లును సమీక్షించామన్నారు. ఒక సం.లో సుమారు 4 కోట్ల మంది ప్రయాణికులు విమానయాన ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్న అంచనాతో భద్రత ఏర్పాట్లును చేస్తున్నామన్నారు. విమానశ్రయానికి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సు అంతర్గత భద్రత కల్పిస్తున్నప్పటికి విమానశ్రయ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చేయడం, ముఖ్య వ్యక్తుల భద్రతకు చర్యలు చేపట్టడం, వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టడం, దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా భద్రత కల్పించడం, అనుమానస్పద వ్యక్తుల కదలికల పై నిఘా ఏర్పాటు చేయడం వంటి విషయాల పై ప్రధానంగా దృష్టి పెడతామని గోపీనాథ్ జట్టి అన్నారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – భోగాపురం ఎయిర్ పోర్టుకు అవసరమైన కట్టుదిట్ట మైన భద్రతను కల్పిస్తామన్నారు. ఎయిర్ పోర్టు ప్రాంగణంలో నిర్మించిన కమాండ్ కంట్రోల్, ఎ.టి.సి, లాంజ్ లను, బ్యాగేజ్, ఇతర భవనాలను సందర్శించి, ఏ భవనంలో ఏ తరహా కార్యకలాపాలు నిర్వహించేది ఎయిర్ పోర్టు అధికారులను అడిగి తెలుసుకొని, భద్రతను సమీక్షించామన్నారు. విమానశ్రయం పరిసర ప్రాంతాల్లో శాంతి భద్రతలను పరి రక్షించడం, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, నేరాలు జరగకుండా చూడడం, అనుమానస్పద వ్యక్తులు, వస్తువుల పై నిఘా పెట్టం జరుగుతుందన్నారు. ఇంకా ఇతర భద్రత సంస్థ లైన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీఫోర్సు, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, ఎయిర్పోర్టు అథార్టీ ఆఫ్ ఇండియా అధికారులు, ఇంటిలిజెన్సు, అగ్నిమాపక శాఖ, వైద్య బృందాలతో సమన్వయంతో పని చేయడం జరుగుతుందన్నారు. విమాన ప్రయాణాలు చేసే ముఖ్య వ్యక్తుల భద్రత కల్పించడం, విమానాశ్రయ ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో వాహనాల రద్దీని నియంత్రించడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందిచడం, ప్రమాదాలు జరగకుండా చూడడం, బెదిరింపులకు తక్షణ చర్యలు చేపట్టడం, దేశ భద్రతకు సంబంధించిన చట్టాలు, స్థానిక చట్టాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. ఈ సమీక్షలో విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఎస్.రాఘువులు, జి.ఎం.ఆర్, ఎల్ అండ్ టి, ఎయిర్ పోర్ట్ అధికారులు, పలువురు సిఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.







# దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిని కలిసిన సుందరపు



**విజయవాడ, పెన్ సత్తా, జులై 08:** విజయవాడ లో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ని యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు దేవాలయాల అభివృద్ధి అంశాల పై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యలమంచిలి నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో నూతన దేవాలయాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేసి, అనుమతులు కల్పించాలని మంత్రిని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక అభివృద్ధికి ఈ దేవాలయాలు ఎంతో దోహదపడతాయని వివరించారు.

అలాగే రాంబిల్లి మండలం లోని పంచదార్ల ఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయం సుమారు 14 వ శతాబ్దానికి చెందిన పాండవులు తిరిగిన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన దేవాలయమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ పురాతన ఆలయానికి అంతరాలయము, ఆలయ పరిసరాలకు అవసర మైన మరమ్మత్తులు చేపట్టడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా, పంచదార్ల కొండను గ్రావెల్ తవ్వకాల కోసం వినియోగించ కుండా తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. చారిత్రక, పర్యావరణ, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాంతాన్ని పరి రక్షించడం అత్యంత అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వినతి పై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి అవసర మైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నేత రాజశేఖర రెడ్డి పయిల





**పరవాడ, పెన్ సత్తా, జులై 08:** మండల కేంద్రంలో సంత బయలువద్ద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నేత, మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77 వ జయంతి సందర్భంగా అయన సేవలను, ప్రజా సంక్షేమ ఆశయాలను స్మరించుకుంటూ ఆయన కాంస్య విగ్రహానికి వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాస రావు, పరవాడ జడ్పీటీసీ పి.ఎస్. రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులతో కలిసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పయిల శ్రీనివాసరావు మాట్లాడుతూ వై.యస్ రాజ్ శేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించి, పేదలు, రైతులు, బలహీన వర్గాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. ఆయన చూపిన సంక్షేమ మార్గాన్ని, ప్రజా సేవా స్ఫూర్తిని వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముందుకు తీసుకెళ్తూ, వైయస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తూ మరింత పార్టీని బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. జడ్పీటీసీ రాజు మాట్లాడుతూ వ్యవసాయం, విద్య, వైద్యం, సామాజిక సంక్షేమ రంగాల్లో వైయస్ఆర్ తీసుకొచ్చిన సంస్కరణలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అదే స్ఫూర్తితో జగన్ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి, అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా వైయస్ఆర్ సీపీ అండగా నిలుస్తుందని, పార్టీకి మద్దతుగా నిలిచిన ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని, ప్రజాసేవలో నిరంతరం ముందుండి పనిచేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడకుండా ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చుక్క రాము నాయుడు, పరవాడ మండల వైస్ ఎంపీపీ లు బంధం నాగేశ్వర రావు, బూస అప్పలరాజు, చెల్లా కనకారావు, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్, వార్డు అధ్యక్షులు అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, తాజా మాజీ సర్పంచ్ లు వెన్నల అప్పారావు, ఎంపీటీసీ లు చప్పా ప్రభాసన్యాసి రావు, గెడ్డం పుష్ప, చంద్రరావు, గొర్లి గోపి, మాజీ పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి కావలివాసు, జిల్లా ప్రచార విభాగ కార్యదర్శి పల్లా గోవింద్, పార్టీ మండల ఉపాధ్యక్షులు బొబ్బిలి సత్తిబాబు, మండల ప్రధాన కార్యదర్శి పయిల రాధా, మండలకార్యదర్సు లు తిక్కాడ సత్యన్నారాయణ, బత్తి అప్పారావు, యలమర్తి వెంకటరావు, వెన్నల సింహాద్రి, మడక సూరిబాబు, పయిల అప్పారావు టీవీ, పయిల హరీష్, పయిల పైడం నాయుడు, మాసవరపు అప్పారావు, బిసి సెల్ అడ్డూరి శ్రీను వాస్, సోషల్ మీడియా అధ్యక్షురాలు దివ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈతలపాక సన్యాసి రావు, బొండా సతీష్ బొద్దపు వెంకటరమణ, శ్రీను, తోట పవన్, కడవల రాజు, శీలం సూరిబాబు, పయిల అప్పారావు, పోలిరెడ్డి వెంకట రావు, సూరాడ తాతారావు, బొండా సతీష్, బోండా కేశవ, పార్టీ కార్యకర్తలు, వైయస్సార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కారం కోసం కృషి.

రాష్ట్ర అధ్యక్షులు నడికుదిటి అర్జున.









**విజయనగరం, పెన్ సత్తా, జులై 08:** పట్టణంలో యూత్ హాస్టల్ బిల్డింగ్ లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నడికుదుటి అర్జున పాల్గొన్నారు. బుధవారం అర్జున అధ్యక్షతన జరిగిన విజయనగరం జిల్లా సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమావేశంలో ఇటీవల సముద్రంలో గల్లంతయిన మత్స్యకారులకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ గంగమ్మ తల్లి ని కోరుకోవడం జరిగినది. జిల్లాలో గల మత్స్యకారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకురావడం జరిగినది. విజయనగరం సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాలు అయినటువంటి శ్రీకాకుళం, పార్వతిపురం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలలో గల సముద్రతీర ప్రాంతాలలో నివసిస్తున్న మత్స్యకారులు, మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న మత్స్యకారుల సమస్యల పై విపులంగా సుదీర్ఘంగా చర్చించడం జరిగినది. ఈ యొక్క సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, ముఖ్యంగా మత్స్యకారి ముద్దు బిడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించడ మైనది. ఈ యొక్క సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు, సంఘం రాష్ట్ర కోశాధికారి కాటా గోపి, సంఘం కోర్ కమిటీ సభ్యులు పలపాల శ్రీనివాసరావు, కోర్ కమిటీ సభ్యులు అంపోలు సత్యనారాయణ, సంఘం ముఖ్య నాయకులు మురుముల్లు శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు, రాష్ట్ర ఆఫ్ కాఫ్ డైరెక్టర్ సింగిడి పాపారావు, మల్లేడు రాంబాబు, తిత్తి సాయి బలరాం, సింగిడి గణేష్, సోమశేఖర్, సొసైటీ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు, నాయకులు అధిక సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.

## ఉత్తర నియోజకవర్గంలో రాజశేఖర్ రెడ్డి 77 వ జయంతి కార్యక్రమం.





**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 08:**ఉత్తర నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77 వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న విశాఖపట్నం జిల్లా యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు, విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిశీలకులు పేడాడ రమణి కుమారి. మాజీ 24 వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77 వ జయంతి సందర్భంగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం 24 వార్డు నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కటింగ్ చేసి, వృద్ధులుకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, సతీష్ వర్మ, మాజీ డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, రాష్ట్ర, మాజీ జిల్లా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ జీవీఎంసీ కార్పొరేటర్, రాష్ట్ర పార్టీ కార్యవర్గం సభ్యులు నగర జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా విభాగం నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఇతర ప్రజా ప్రతినిధుల, తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమం.



**నర్సీపట్నం, పెన్ సత్తా, జులై 08:** మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వై . ఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గణేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని కొనియాడారు. ప్రజాసేవకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకాయల సన్యాసి పాత్రుడు, కోనేటి రామకృష్ణ, అడ్వకేట్ బుల్ దొర, దొరబాబు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారాయణ ఈ-టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవం

**పల్నాడు జిల్లా సత్తెనపల్లి పెన్ సత్తా, జులై 08:** : నారాయణ ఈ-టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో.. తహసీల్దార్ కార్యాలయం మరియు పోలీస్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద వన మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా కార్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ఆర్డీఓ గోపాలకృష్ణ మొక్కల పెంపకం, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించి, వన మహోత్సవ వారోత్సవాల ద్వారా ప్రజల్లో మొక్కలు నాటడంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ కె.ఎస్. చక్రవర్తి , సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. నాగ మల్లికార్జున్ , సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎం. పవన్ కుమార్ , ప్రిన్సిపాల్ శ్రీ వై. రామకృష్ణ , విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీ , పర్యావరణ నినాదాలు , ఫ్లాష్ మాబ్ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# ఘనంగా ఎన్‌టిపిసి సింహాద్రి 29 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**పరవాడ, పెన్ సత్తా, జులై 08:**
ఎన్‌టిపిసి సింహాద్రి 1997 లో ప్రారంభ మైనప్పటి నుండి తన 29 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని, ఎన్‌టిపిసి సింహాద్రి బుధవారం తన 29 వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ వేడుకలకు ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ అయస్కాంత జెనా నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (మెయింటెనెన్స్) హెచ్. కె. వర్మ, జనరల్ మేనేజర్ (విపిజి) వెంకట రమణ నారాయణ శెట్టి, వివిధ శాఖల అధిపతులు, వివిధ సంఘాలు, సంక్షేమ సంస్థల ప్రతినిధులు, స్టేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ యొక్క విశేష మైన వారసత్వం, విజయాలు, కార్యాచరణ శ్రేష్ఠత, సుస్థిరత, సమాజ అభివృద్ధి పట్ల నిరంతర నిబద్ధతను స్మరించుకున్నారు.
ఎన్‌టిపిసి జెండా ఆవిష్కరణతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఎన్‌టిపిసి గీతం ఆలపించారు. ఈ సందర్భంగా, సింహాద్రి యొక్క 29 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రదర్శించే ఒక ప్రత్యేక చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ చిత్రం, సంవత్సరాలుగా స్టేషన్ సాధించిన మైలురాళ్లు, విజయాలు, చేసిన సేవలను ప్రముఖంగా చూపించింది. సభను ఉద్దేశించి ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ అయస్కాంత జెనా మాట్లాడుతూ
స్టేషన్ ప్రారంభ మైనప్పటి నుండి దాని ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ సంవత్సరాలుగా సాధించిన అనేక మైలు రాళ్లను ప్రముఖంగా ప్రస్తావించారు. 2002 ఫిబ్రవరి 22 న, కేవలం 39 నెలల రికార్డు సమయంలో యూనిట్-1ను సింక్రనైజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. స్టేజ్-1 విజయవంతంగా పూర్తి చేసినందుకు, 2005 లో అత్యుత్తమ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రతిష్టాత్మక ఐపిఎంఏ అవార్డు లభించింది. ఈ గౌరవాన్ని అందుకున్న మొట్ట మొదటి ఆసియా కంపెనీగా సింహాద్రి నిలిచింది. దిగుమతి చేసుకున్న బొగ్గును మండించి, కండెన్సర్ శీతలీకరణ, బూడిద తొలగింపు కోసం సముద్రపు నీటిని ఉపయోగించిన మొట్ట మొదటి ఎన్‌టిపిసి స్టేషన్‌గా సింహాద్రికి ఉన్న ప్రత్యేకతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అంతే కాకుండా, వరుసగా తొమ్మిదవ సంవత్సరం కూడా 100% పైగా బూడిదను వినియోగించుకుంటూ, పర్యావరణ సుస్థిరత పై స్టేషన్ నిరంతరం దృష్టి సారిస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. శ్రేష్ఠత అనేది ఒక గమ్యం కాదు అది ఎప్పటికీ అంతం కాని నిరంతర ప్రయాణం అని జెనా అన్నారు. స్టేషన్ యొక్క ఘన మైన వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని, రాబోయే సంవత్సరాలలో ఉన్నత ప్రమాణాల పనితీరు కోసం నిరంతరం కృషి చేయాలని ఆయన సింహాద్రి బృందాన్ని కోరారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) ‌ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సౌత్) అయిన అజయ్ శర్మ వర్చువల్‌గా సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ సందర్భంగా సింహాద్రి బృందాన్ని అభినందించారు. స్టేషన్ యొక్క స్థిరమైన పనితీరును ఆయన ప్రశంసించారు. సింహాద్రిని ఎన్‌టిపిసి యొక్క ప్రధాన స్టేషన్లలో ఒకటిగా అభివర్ణించారు. ఉద్యోగుల సమిష్టి కృషిని ఆయన గుర్తించి, కార్యాచరణ శ్రేష్ఠతలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ, దేశ ఇంధన వృద్ధికి దోహదపడాలని వారిని ప్రోత్సహించారు.
29 వ ఆవిర్భావ దినోత్సవ వేడుక, దాదాపు మూడు దశాబ్దాలుగా ఎన్‌టిపిసి సింహాద్రి సాధించిన ఘన మైన ప్రస్థానాన్ని స్మరించుకుంది. రాబోయే సంవత్సరాలలో శ్రేష్ఠత, ఆవిష్కరణలు మరియు సుస్థిర వృద్ధిని కొనసాగించాలనే సింహాద్రి బృందం యొక్క నిబద్ధతను ఈ వేడుక పునరుద్ఘాటించింది.




# పోలీసుల ఆకస్మిక దాడి గంజాయి స్వాధీనం, ఐదుగురు నిందితుల అరెస్ట్.

- సరుగుడు తోటలో ప్యాకెట్లు చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు.
- నిందితులకు 14 రోజుల రిమాండ్.
- మునగపాక పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ.




**మునగపాక, పెన్ సత్తా, జూలై 08**: అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ బి.మోహన రావు ఆదేశాల మేరకు, యలమంచిలి రూరల్ సీఐ ధనుంజయ రావు పర్యవేక్షణలో మునగపాక సబ్ ఇన్స్పెక్టర్ పి.ప్రసాద రావు, సిబ్బంది మత్తుపదార్థాల నిర్మూలనే ధ్యేయంగా ముమ్మర దాడులు నిర్వహించారు.
మునగపాక పోలీస్ స్టేషన్ పరిధి లోని నాగులపల్లి గ్రామ శివారులో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం పై బుధవారం మునగపాక పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. నాగులపల్లి గ్రామ శివారు లోని సరుగుడు తోటలో నిందితులు గంజాయిని సేవిస్తూ, ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్ సహాయంతో 20 గ్రాముల చొప్పున చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి అమాయక యువతకు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు చాకచక్యంగా చుట్టు ముట్టి రౌండప్ చేశారు. ఈ దాడిలో
అరెస్ట్ అయిన నిందితుల వివరాలు
1 కాండ్రేగుల జై వినయ్, 2. ఉండు దుర్గ సాయి ఏ సాయినాథ్, 3. వెదురుపర్తి జయరాం, 4. బండారు వరుణ్ కుమార్,
5. భీమిశెట్టి మిధున్ కుమార్ లు వున్నారు. వీరివద్ద నుండి స్వాధీనం చేసుకున్న సొత్తు 3.310 కిలో ల గంజాయి, ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్ 1,
మొబైల్ ఫోన్లు 3, మోటార్ సైకిళ్లు 4 (నేరానికి ఉపయోగించినవి).
ఈ ఘటన పై మునగపాక పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 109/2026 కింద కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన ఐదుగురు నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీనితో నిందితులను జైలుకు తరలించడం జరిగింది. ఈ అరెస్ట్ పై ?జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.
సమాచారం అందిన వెంటనే అత్యంత వేగంగా, వ్యూహాత్మకంగా స్పందించి నిందితులను పట్టు కోవడమే కాకుండా, పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్న మునగపాక ఎస్ఐ పి.ప్రసాద రావు ను, పర్యవేక్షించిన సిఐ ధనుంజయ రావు ను, సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు.
జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాల రవాణా, విక్రయదారుల పై ఇలాంటి కఠిన చర్యలు మున్ముందు కూడా కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరించారు.
జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా ప్రజలు భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, డయల్-112 లేదా ఈగల్ టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1972 కు సమాచారం అందించాలని జిల్లా పోలీస్ శాఖ కోరింది. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77 వ జయంతి వేడుకలు







**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 08:**మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77 వ జయంతి సందర్భంగా జిల్లా లోని యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల్లో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ప్రభుత్వ విప్, యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, అనకాపల్లి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఒక నాయకుడు మాత్రమే కాదు, పేద ప్రజల ఆశాకిరణం, ప్రతి పేద కుటుంబం సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన మహానేత అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటు లోకి తీసుకువచ్చారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా లక్షలాది మంది పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి, ఎన్నో కుటుంబాల భవిష్యత్తును మార్చారు. రైతులకు ఉచిత విద్యుత్, జలయజ్ఞం,108 అంబులెన్స్,104 ఆరోగ్య సేవలు, ఇందిరమ్మ గృహాలు, పావలా వడ్డీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేతగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలు, సేవా దృక్పథం,మానవత్వం మనందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తి. ఆయన చూపిన సంక్షేమ బాటలో నడవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు.
ఈ కార్యక్రమంలో యలమంచిలి నియోజకవర్గం ‌ అనకాపల్లి నియోజకవర్గం, మండలం పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ఆర్ ఘాట్ వద్ద రాజశేఖర్ రెడ్డి కి ఘన నివాళులు




**కడప, పెన్ సత్తా, జులై 08:**మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77 వ జయంతి సందర్భంగా ఇడుపులపాయ లోని వైయస్ఆర్ ఘాట్ వద్ద వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి, వైయస్ విజయమ్మ, వైయస్ భారతి తో పాటు కలిసి ఘనంగా నివాళులర్పించిన రాష్ట్ర మాజీ మంత్రి, సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కే.వి.ఉషాశ్రీ చరణ్. ఈ కార్యక్రమంలో పలువురు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్వచ్ఛతా పక్వాడా ను జయప్రదం చేయండి.




- మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచాలి
- పర్యావరణ హిత జీవన విధానం అలవరుచుకోవాలి
- ఇందు ప్రియ, హెచ్ ఆర్ మేనేజర్ ,హెచ్ పిసిఎల్ సౌత్ సెంట్రల్ జోన్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 08:**
స్వచ్ఛతా పక్వాడా ను జయప్రదం చేయండి అని హెచ్ పిసిఎల్ సౌత్ సెంట్రల్ జోన్ హెచ్ ఆర్ మేనేజర్ ఇందు ప్రియ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా పక్వాడా లో భాగంగా ప్రకాశరావు పేట హైస్కూల్ లో హెచ్ ఎమ్ విజయ మాలిని అధ్యక్షతన, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం నేతృత్వంలో విత్తనాల బంతులు తయారు చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. లేకుంటే మన ఆరోగ్యం దెబ్బతింటుందని వివరించారు. విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచాలి అని కోరారు. పర్యావరణ హిత జీవన విధానం అలవరుచు కోవాలి అని కోరారు. జివిఎంసి ఉన్నత పాఠశాల హెచ్ ఎం విజయ మాలిని మాట్లాడుతూ విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచి పర్యావరణ హితంగా జీవించాలి అని కోరారు. విత్తనాల బంతులు అధిక సంఖ్యలో తయారు చేయించి సామాజిక వనాలు పెంచడం ద్వారా శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలి అని అన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలి అని కోరారు. ప్రతి కుటుంబానికీ అవగాహన కల్పించడం అవసరం అన్నారు. మహా వృక్షాలు మనమే కాపాడు కోవాలని, అతి పెద్ద వృక్షాలు అంటే అదొక జీవావరణ వ్యవస్థ అని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని వివరించారు.
హెచ్ పిసిఎల్ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ సూపరింటెండెంట్ నాగ రాజేశ్వరి మాట్లాడుతూ అడవులు పుడమి తల్లి ఊపిరితిత్తులు అని అన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళి దే అని అన్నారు. జీవవైవిధ్య పరి రక్షణ బాధ్యత మానవాళి మీదే ఉంది అన్నారు. ఏ జీవి అంతరించినా దాని దుష్ప్రభావం మానవాళి మీదే పడుతుంది అని హెచ్చరించారు. ప్రకృతి వనరులను మనమే కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూణేకి చెందిన ఫ్లేమ్ విశ్వవిద్యాలయం సైకాలజి విద్యార్థిని నందినీ రోయ్, ఎన్ సి సి 13వ బెటాలియన్ హవల్దార్ చంద్రశేఖర్, ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, ఉపాధ్యాయులు వి శైలజ, జి జయశ్యామల, కె.లక్ష్మి పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇంగ్లీష్, హిందీ భాషల్లో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు.

# రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేయాలి

ఏ పి రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ విజ్ఞప్తి

**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 08:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2026 - 27 ఖరీఫ్, రబీ పంటలకు ఉచిత బీమా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పంటల వారీగా రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించాలి. అలా ప్రీమియం చెల్లించిన వారికి మాత్రమే పంటల బీమా వర్తిస్తుంది. గడిచిన రెండు సంవత్సరాలలో రైతులు ప్రీమియం చెల్లించినప్పటికీ ప్రభుత్వం వాటా చెల్లించకపోవడం వల్ల రైతులకు పంటల బీమా ప్రయోజనం అందలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రైతు నాయకుడు ఎం అప్పలరాజు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా ద్వారా రైతులకు ప్రయోజనం కలగాలని భావిస్తే అన్ని పంటలకు ఉచిత పంటల బీమా అమలు చేయాలని, రైతుల వాటా పేరుతో లేదా ఐచిక పంటల బీమా పేరుతో పంటల బీమా నుండి రైతులను దూరం చేసే ప్రభుత్వ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. గడిచిన రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వాన్ని అనుసరిస్తున్న ఐచ్చిక పంటల బీమా లేదా రైతుల భాగస్వామ్యంతో పంటల బీమా ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు.వాతావరణ ప్రతికూల ప్రభావం వల్ల, దిగుబడి ఆధారత పంటల బీమా వల్ల రైతులకు ఏదైనా ప్రయోజనం కలగాలని ప్రభుత్వం భావిస్తే అది ఉచిత పంటల బీమా ద్వారా మాత్రమే కలుగుతుందన్నారు.రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియం వాటాను రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వమే ఈ క్రాప్ ఆధారంగా అందరు రైతులకు, కౌలు రైతులకు అన్ని ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలకు ఉచిత పంటల బీమా అమలు చేయడం ద్వారా రైతులకు మేలు కలుగుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులలో సవరణ చేయాలని ఉచిత పంటల బీమా విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుచున్నామన్నారు. రైతులకు ప్రయోజనం లేని ప్రభుత్వ విధానాన్ని తక్షణమే రద్దు చేసి ఉచిత పంటల భీమా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు.



# వాడవాడలా పండగల వైయస్సార్ జయంతి వేడుకలు



ఘన నివాళులర్పించిన వైసీపీ శ్రేణులు




**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 08:** పేదల పెన్నిధి దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు వాడవాడలా పండగల నిర్వహించారు. దివంగత నేత రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా మండలంలో ఉన్న వైఎస్ విగ్రహాలకు వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ ఎత్తున జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల కేంద్రం నక్కపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వైయస్సార్ విగ్రహానికి వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పూలమాలు వేసిన వాళ్ళు అర్పించారు. అనంతరం స్థానిక 50 పడకల ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి సిబ్బందిని శాలువాతో సత్కరించారు.దేవవరం, ఉద్దండ పురం, నెల్లిపూడి, తీనార్ల, ఉపమాక, సి హెచ్ ఎల్ పురం, సరిపల్లి వాని పాలెం తదితర గ్రామాల్లో వైయస్సార్ జయంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, జడ్పిటిసి సభ్యురాలు గోసాల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు, సీరం నరసింహమూర్తి ,నాయకులు పొడకట్ల పాపారావు, సూరకాసుల గోవిందు, సాదిరెడ్డి శీను, కొప్పిశెట్టి హరిబాబు, అల్లాడ కొండబాబు, వీసం రాజు, తల్లా భార్గవ్ మత్స్యకార నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## పీఎండీఎస్‌తో రైతులకు మెరుగైన ఫలితాలు.

గవరపాలెంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బుస్సాల శ్యామల



**పెందుర్తి, పెన్ సత్తా, జూలై 08:** ప్రకృతి వ్యవసాయంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పిఎండిఎస్) విధానం రైతులకు స్థిరమైన దిగుబడులతో పాటు సాగు ఖర్చులను తగ్గిస్తోందని రైతు సాధికార సంస్థ విశాఖపట్నం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బుస్సాల శ్యామల తెలిపారు. శుక్రవారం పెందుర్తి మండలం గవరపాలెం గ్రామంలో ఆమె పర్యటించి పీఎండీఎస్ రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించారు. సమావేశంలో పాల్గొన్న రైతులు గత మూడు సంవత్సరాలుగా పీఎండీఎస్‌ను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించుకుంటూ ప్రస్తుతం పురుగుమందుల వాడకాన్ని పూర్తిగా నిలిపివేశామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు సాగు వ్యయం తగ్గి పంటల నాణ్యత పెరుగుతోందని రైతులు తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బుస్సాల శ్యామల వరి నర్సరీ దశలో విత్తన శుద్ధి (సీడ్ ట్రీట్మెంట్) యొక్క ప్రాముఖ్యతను వివరించి, తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలను రైతులకు తెలియజేశారు. అలాగే ఎల్–నినో పరిస్థితుల వల్ల వ్యవసాయం పై కలిగే ప్రభావాలు, వాటిని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఎలా అధిగమించవచ్చో వివరించారు. అనంతరం రైతులకు సమాచార, విద్యా, కమ్యూనికేషన్ (ఐఈసి) ప్రచార సామగ్రిని పంపిణీ చేశారు. క్షేత్ర స్థాయిలో 0.90 ఎకరాల్లో సజ్జ పంటలో ఒక పీఎండీఎస్ ప్రదర్శన ప్లాట్‌తో పాటు ఒక పాలీక్రాపింగ్ ప్రదర్శన ప్లాట్‌ను ఏర్పాటు చేశారు. ఈ విధానాల ప్రయోజనాలను క్షేత్రస్థాయి సిబ్బందికి వివరించి, మండలంలోని సజ్జ రైతులందరికీ ఈ సాంకేతికతలను విస్తృతంగా చేరవేయాలని సూచించారు. అనంతరం పీఎండీఎస్ ప్రయోగాత్మక కాంపాక్ట్ బ్లాక్‌లను పరిశీలించిన శ్యామల, మొత్తం 18 రకాల విత్తనాలు విజయవంతంగా మొలకెత్తినట్లు గుర్తించారు. ట్రిపుల్ కిట్ ప్లాట్‌లో పంట ఏపుగా పెరిగి కలుపు మొక్కలు లేకుండా ఉండగా, డబుల్ కిట్ ప్లాట్‌లో సింగిల్ కిట్ ప్లాట్‌తో పోలిస్తే కలుపు మొక్కల సాంద్రత చాలా తక్కువగా ఉన్నట్లు పరిశీలించారు. ఈ ఫలితాలు జీవ ఆధారిత ఇన్‌పుట్ల ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మోడల్ మండల టీమ్ లీడ్ గణేష్ కుమార్, ఎన్ఎఫ్ఏ హెచ్ఆర్ డ జెండర్ శ్రీనివాస్ చక్రవర్తి పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలను ప్రతి రైతు క్షేత్రస్థాయిలో అమలు చేసి, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేందుకు పీఎండీఎస్, పాలీక్రాపింగ్ వంటి విధానాలను విస్తృతంగా స్వీకరించాలని వారు పిలుపునిచ్చారు.

## శేషాపురం భక్తులకు దివ్య పుణ్యయాత్ర బీవీ అరుణ్ కుమార్ రెడ్డి.

విహెచ్‌పీ ఉపాధ్యక్షురాలు చిన్నపరెడ్డి పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వైభవం.





**అయోధ్య, జులై 08:** శేషాపురం గ్రామ భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రాల సందర్శనతో అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని సొంతం చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ యువనేత బీవీ అరుణ్ కుమార్ రెడ్డి, జయనగర్ జిల్లా విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పీ) ఉపాధ్యక్షురాలు చిన్నపరెడ్డి పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పుణ్యయాత్రలో భక్తులు ముందుగా పవిత్ర ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం శ్రీరామ జన్మభూమి అయోధ్యకు చేరుకుని సరయూ నది ఘాట్‌ను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భవ్యమైన శ్రీరామ జన్మభూమి మందిరంలో బాలరాముడి దివ్య దర్శనం చేసుకుని దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వేదఘోషలు, భక్తిమయ వాతావరణం మధ్య బాలరాముడి దర్శనం భక్తులను భావోద్వేగానికి గురిచేసింది. ఈ సందర్భంగా యువనేత బీవీ అరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ గొప్పతనాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం ఈ పుణ్యయాత్ర ద్వారా లభించిందని, యువతలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి యాత్రలు ఎంతో అవసరమని అన్నారు. విహెచ్‌పీ జయనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు చిన్నపరెడ్డి పద్మావతి రెడ్డి మాట్లాడుతూ ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానం నుంచి అయోధ్య బాలరాముడి దర్శనం వరకు ప్రతి ఘట్టం భక్తుల జీవితాల్లో చిరస్మరణీయ అనుభూతిగా నిలిచిందని, శ్రీరాముని కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. శేషాపురం గ్రామ భక్తులు అయోధ్య శ్రీరామ మందిరం ముందు జ్ఞాపకార్థం సమూహ చిత్రాలు దిగుతూ ఈ పుణ్యయాత్రను జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభవంగా అభివర్ణించారు.

# ఆరేళ్లలో 67 లక్షల సైబర్ నేరాలు

ప్రపంచం మొత్తం మీద డిజిటల్ డేటాలో భారతదేశం ఇప్పుడు 20 శాతానికి చేరుకుంది. డిజిటల్ చెల్లింపులు, స్మార్ట్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరగడంతో సైబర్ నేరాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు కృత్రిమ మేధస్సు (ఎఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీ ఉపయోగించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో ప్రజలను మోసగిస్తున్నారు. కొన్ని కోట్లు కొల్లగొడుతున్నారు. 2019- 2025 వరకు 67.32 లక్షల సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండింట మూడొంతులు అంటే 43.22 లక్షల కేసులు గత రెండేళ్ల లోనే నమోదు కావడం గమనార్హం. గత ఆరేళ్లలో సైబర్ మోసాల ద్వారా సుమారు రూ. 55,000 కోట్లు బాధితులు నష్టపోయారు. అంటే ప్రతి ఐదు రూపాయల్లో నాలుగు రూపాయలు సైబర్ మోసాల ఖాతాకే చేరాయి. అంతేకాదు అశ్లీల పదజాలం కూడా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లద్వారా వ్యాప్తి చెందుతోంది.రేప్ వీడియో, చైల్డ్ వీడియో ద్వారా పిల్లలకు సంబంధించిన అసభ్యకరమైన పదజాలంతో పెయిడ్ యాడ్స్ కనిపించాయని వాటిని క్లిక్ చేసిన వినియోగదారులు టెలిగ్రామ్ ఛానెళ్లకు మళ్లించి ఆ వీడియోలను విక్రయిస్తున్నారని ఓ మీడియా సంస్థ బయటపెట్టగా ప్రభుత్వం స్పందించి ఆ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత మెటా సంస్థను గట్టిగా హెచ్చరించింది. ఇలాంటి సంఘటనలు చాలా పెద్ద సమస్యలో ఓ చిన్నభాగం మాత్రమే. రోజురోజుకూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండగా, అంతకన్న వేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రత్యేక నియంత్రణ చట్టాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటివరకు డీప్‌ఫేక్స్, ఇతర సమస్యలను నివారించడానికి ప్రభుత్వం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)చట్టంపై ఆధారపడుతూ వచ్చింది అయితే ఎఐ వ్యవస్థలు కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి, సాంకేతికతను సురక్షితంగా మార్చడానికి ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకు రావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ పర్యావరణ వ్యవస్థ మనకు ఏర్పాటైంది. ఇందులో ఆధార్, యుపిఐ, ఒఎన్‌డిసి వ్యవస్థలు ఇమిడి ఉన్నాయి. ఆధార్ వల్ల ప్రజల గుర్తింపు స్థిరీకరణ జరగడమే కాక, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు నేరుగా చేరడానికి ఉపయోగపడుతుంది. యుపిఐ అన్నది తక్షణ చెల్లింపుల వ్యవస్థ. స్మార్ట్‌ఫోన్ ద్వారా చిల్లర వ్యాపారం నుండి పెద్దపెద్ద లావాదేవీల వరకు సెకన్లలో డబ్బులు పంపడానికి, స్వీకరించడానికి తోడ్పడుతోంది. ఒఎన్‌డిసి వాణిజ్య రంగాన్ని వికేంద్రీకరించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఓపెన్ నెట్‌వర్క్. దీని ద్వారా చిన్న వ్యాపారులు, స్థానిక విక్రేతలు, కూడా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించవచ్చు. ఈ ప్లాట్‌ఫారాలన్నీ సామాన్యుల దైనందిన జీవితాన్ని ఎంతో సులభతరం చేశాయి. ఇవి పాలనా వ్యవహారాలను, ఆర్థిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చాయి.ఈ సౌకర్యాలు ఎలా ఉన్నా డిజిటల్ దాడులు విస్తరించే ప్రమాదాలు కూడా పెరిగాయి. కృత్రిమ మేధస్సు సహాయంతో జరిగే సైబర్ దాడులను గుర్తించడం, వాటిని నివారించడం చాలా కష్టంగా మారుతోంది. ఈ దాడులు బ్యాంకింగ్, టెలికమ్యూనికేషన్స్, రక్షణ (డిఫెన్స్), విద్యుత్, ఆరోగ్య భద్రతరంగాలకు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారంగానే సైబర్ నేరగాళ్లు అత్యంత నమ్మదగిన ఫిషింగ్ ఈ మెయిల్స్, డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ గుర్తింపులు, అధునాతన మాల్వేర్‌ను సృష్టిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ కనిపెట్టలేని విధంగా నిరంతరం తమ కోడ్‌ను మార్చుకునే మాల్‌వేర్‌ను సృష్టిస్తున్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎఐ టూల్స్ సహాయంతో హ్యాకర్లు సాఫ్ట్‌వేర్‌లో లోపాలను అందరికన్నా ముందుగానే పసిగట్టి దాడులకు పాల్పడుతున్నారు. వీటిని నివారించడం సైబర్ సెక్యూరిటీ నిపుణులకు పెద్ద సవాలుగా మారింది. సైబర్ ముప్పులను నివారించడానికి ప్రభుత్వం అనేక ఆవిష్కరణలను ప్రవేశపెట్టింది. ఇండియా ఎఐ మిషన్‌తోపాటు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి ఇన్) వ్యవస్థను బలోపేతం చేసింది. జీరో ట్రస్ట్ అనే పద్ధతిని స్వీకరించింది.సాధారణ భద్రత విధానాల్లో ఒకసారి నెట్‌వర్క్ లోకి ప్రవేశించిన ఎవరినైనా లేదా ఏదైనా పరికరాన్ని నమ్ముతారు. కానీ జీరో ట్రస్ట్ విధానంలో, నెట్‌వర్క్ లోపల ఉన్నా లేదా బయట ఉన్నా ఎవరినీ గుడ్డిగా నమ్మరు. ఆ వినియోగదారుడి పనికి అవసరమైన డేటా, ఫైల్స్ లేదా అప్లికేషన్‌కు మాత్రమే అనుసంధానం కలుగుతుంది. దీనివల్ల డేటా రక్షణ కలుగుతుంది. సైబర్ దాడుల నుండి డేటాను కాపాడుకోడానికి ప్రభుత్వ ఏజెన్సీలు సిఇఆర్‌టి ఇన్ వంటి సంస్థలు భద్రతా లోపాలను గంటల వ్యవధి లోనే పరిష్కరించాలన్న నిబంధనలు తీసుకు వస్తున్నారు. భారత్ ఏ దేశంపై ఆధారపడకుండా ఇప్పుడు స్వంతంగా కృత్రిమ మేధస్సు సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. రూ.10,300 కోట్లకు పైగా బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం ఇండియా ఎఐ మిషన్‌ను ప్రారంభించింది. లక్షలాది మందికి ఉపయోగపడేలా జిపియు కంప్యూటింగ్ (గ్రాఫింగ్ ప్రాసెసింగ్ యూనిట్), స్టార్టప్ ఫండింగ్ వ్యవస్థలను అందుబాటు లోకి తెస్తోంది. ఏదేమైనా ఈ ప్రయత్నాలన్నీ విచ్ఛిన్నంగానే ఉంటున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా మొత్తం 1,01,118 సైబర్ నేరాలు నమోదయ్యాయి. కాగా తెలంగాణలో వాటి సంఖ్య 27,230. అంటే తెలంగాణ వాటానే 27%గా నమోదయింది. రాష్ట్రంలో రోజుకు సగటున 75 సైబర్ నేరాల కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే తరహాలో కర్ణాటకలో 21,993 కేసులు నమోదై రెండోస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాల బారిన పడుతున్న బాధితుల్లో తెలంగాణ వాసులు దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.క్రైమ్‌రేట్ ఏకంగా 71.1 : ఒకవైపు సైబర్ నేరగాళ్ల ముఠాలు తెలంగాణ వాసుల్నే లక్ష్యంగా చేసుకొని ఆర్థిక దోపిడీకి పాల్పడుతుంటే మరోవైపు అభియోగాల నమోదు రేటు అధమ స్థానంలో ఉండటం విస్తుగొలుపుతోంది. జనాభా ఆధారంగా రాష్ట్రంలో క్రైమ్‌రేట్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఏకంగా 71.1గా నమోదు అయింది. రెండోస్థానంలో ఉన్న కర్ణాటకలో అది 32.2. దేశవ్యాప్త సగటు 7.4 మాత్రమే ఉంది. రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత విషయంలో పోలీస్‌శాఖ వాదన మరోలా వినిపిస్తోంది. తమకు అందుతున్న ప్రతీ ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తుండటంతోనే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసులు చెబుతున్నారు. ఏదేమైనా కేసుల నమోదులో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీసులు అభియోగపత్రాల నమోదు రేటులో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో ఈ సగటు కేవలం 16.2 కాగా దేశవ్యాప్త సగటు ఏకంగా 31.6గా నమోదయింది.వీటికి సంబంధించిన ఏజెన్సీలు వేటికి అవే స్వతంత్రంగా పనిచేస్తున్నాయి తప్ప సమన్వయం కనిపించడం లేదు. ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (14 సి)ను బలోపేతం చేయడం ద్వారా కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య సమన్వయం పెరిగి సైబర్ బెదిరింపుల ముప్పును ఎదుర్కోగలుగుతారు. భారత దేశం తన ఎఐ వ్యూహంలో కేవలం సాంకేతికతను అభివృద్ధి చేయడమే కాక, దానిని సైబర్ దాడుల నుండి రక్షించుకునే సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకోవడం తప్పనిసరి

# మళ్లీ వరదకష్టాల్లో ముంబై



ఎప్పటి మాదిరే ముంబై మహానగరం భారీ వర్షాలతో తడిసి ముద్దయింది. గత ఆరు రోజుల కుంభవృష్టితో 13 మంది మరణించారు. జనావాసాలు వరద నీట మునగడం, చెట్లు కూలడం, రోడ్ల ఆచూకీ తెలియకుండా పోవటం, ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి వాహనదారులు దిక్కుతోచని స్థితికి చేరటం, రైళ్లన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోవటం, విద్యాసంస్థలన్నీ మూతపడటం, పరీక్షలు వాయిదాలు పడటం... ఇవన్నీ దాదాపు ప్రతియేటా ముంబై ప్రజలకు రివాజుగా మారాయి. ఒక పిటిషన్ విచారణ సందర్భంగా మంగళవారం బృహన్ముంబై కార్పొరేషన్(బీఎంసీ)ని అనవసరంగా నిందించవద్దని బొంబాయి హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. భూదురాక్రమణలకు పాల్పడటం, పేవ్‌మెంట్లు ఆక్రమించటం, చెత్తను ఎక్కడికక్కడ మురికి కాల్వల్లోకి తోసేయటం వంటి ధోరణులే సమస్యల్ని సృష్టిస్తున్నాయని తెలిపింది. అది నిజమే కావొచ్చుగానీ... అలాంటి ధోరణులను అరికట్టే బాధ్యత కూడా బీఎంసీదే. ఆ విషయంలో అది విఫలం కావటంవల్లనే ప్రతియేటా సమస్యలు తప్పడంలేదు.

వానాకాలం వచ్చిందంటే ముంబైలో పెనుగాలులు, కుంభవృష్టి ఏకకాలంలో విరుచుకుపడుతుంటాయి. భౌగోళికంగా ముంబై ఉన్న స్థానం అటువంటిది గనుక ఇది అనివార్యమైన పరిస్థితి. అయితే దాన్ని దృష్టిలో పెట్టుకుని చేయాల్సిందేమిటన్న అంశంపై సమగ్ర దృష్టి సారిస్తే పరిష్కారం లభించకపోదు. ప్రభుత్వాలు ఆ పని చేయవు. బీఎంసీ ఒత్తిడి తీసుకురాదు. ముంబై ఒకప్పుడు ఏడు దీవుల సమాహారం. వాటిమధ్య 1784 నుంచి 1845 వరకూ మట్టి నింపుతూ పోవటం వల్ల ఇప్పుడున్న భౌగోళిక రూపం వచ్చింది. సముద్ర మట్టానికి ఈ నగరం కేవలం 14 మీటర్ల ఎత్తులో ఉంటుంది. కొన్నిచోట్ల ఒకటి, రెండు మీటర్లకు మించి లేదు. ముంబై వరదనీట కోసం నాలుగు నదులున్నాయి. నాలాలున్నాయి. వీటి ద్వారా నీరంతా సముద్రంలో కలుస్తుంది. కానీ వర్షాల తీవ్రత వుండి, సముద్రపు పోటు అధికంగా ఉంటే ఇవి అక్కరకు రావు. భూ మాఫియాల పుణ్యమా అని తీరాన ఉన్న మడ అడవులు, చిత్తడి నేలలు మాయమై రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతుంటే నిలువరించే వ్యవస్థలు లేవు. బ్రిటిష్ కాలంనాటి డ్రెయినేజీ వ్యవస్థ, కాంక్రీట్ నిర్మాణాలు, మరోపక్క వలసలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

నీటితో కలిసి జీవించటం అలవాటు చేసుకుంటే, అందుకనుగుణమైన జీవన విధానం అలవరుచుకుంటే ఇంత చేటు సమస్య ఉండదు. టోక్యో నగరం ఇందుకు ఉదాహరణ. అక్కడ ప్రతియేటా తుపాన్లు తప్పవు. పర్యవసానంగా వరదనీరు ముంచె త్తుతుంది. దీన్ని అధిగమించటం కోసం 2006లో ప్రపంచంలోనే అతి పెద్ద భూగర్భ వరద నీటి మళ్లింపు వ్యవస్థను నిర్మించింది. నగరం కింద 50 మీటర్ల లోతులో 6.3 కిలోమీటర్ల పొడవునా భారీ టన్నెళ్లు ఏర్పరిచారు. భారీ వరద నీరు ముంచెత్తినప్పుడు అదంతా ఆ టన్నెళ్లకూ, అక్కడినుంచి అయిదు అతి పెద్ద బావుల్లోకీ... వాటినుంచి భారీ భూగర్భ ట్యాంకుల్లోకీ పోతుంది. అక్కడినుంచి శక్తిమంతమైన జెట్ ఇంజన్ పైపులతో ఆ నీటిని తోడి నగరం ఆవలి భాగంలోని ఎడొగావా నదిలోకి పంపుతారు. చైనాలోనూ స్పాంజ్ సిటీల పేరుతో నీటిని ఎప్పటికప్పుడు భూమిలోకి పంపే రంధ్రాలున్న రోడ్లు నిర్మించారు. నగరాల చుట్టూ కృత్రిమంగా చిత్తడి నేలలు ఏర్పరిచారు. ఇవన్నీ వర్షపు నీటిని పీల్చుకుని భూగర్భ జలాలుగా మారుస్తాయి. సాధారణ రోజుల్లో పిల్లలకు ఆట స్థలాలుగా, భారీ వర్షాల సమయంలో తాత్కాలిక చెరువులుగా మారే వాటర్ స్క్వేర్‌లు నిర్మించి రోటర్‌డ్యామ్ నగరాన్ని నెదర్లాండ్స్ ప్రభుత్వం కాపాడుకుంది.

ముంబై నగరాన్ని ప్రకృతి దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టడం కాక, అందుబాటులోని సాంకేతికతల సాయంతో తగిన ప్రణాళికలు రచించుకుంటే అక్కడి ప్రజలకు ప్రతియేటా ఈ తిప్పలు తప్పుతాయి. మాఫియాలను నియంత్రించటం, మౌలిక సదుపాయాలు... ముఖ్యంగా రవాణాను మెరుగుపరచటం వంటివి చేస్తే నగరం కిక్కిరిసిపోయే పరిస్థితిని నివారించవచ్చు. బ్రిడ్జిల నిర్మాణం, రోడ్ల వెడల్పు పేరుతో భారీ ప్రాజెక్టులు చేపట్టి అవి ఏళ్లతరబడి కొనసాగించటంవల్ల జనజీవనం స్తంభించిపోతోంది. వర్షాకాలం ఇదంతా అనేక రెట్లు పెరుగుతోంది. ఇప్పటికైనా మహారాష్ట్ర ప్రభుత్వం మేల్కొనాలి.

# నీళ్లు ఎత్తిపోస్తరా.. డెల్టాకు వదిలేస్తరా?



తెలంగాణలో సూపర్ ఎల్ నినో కరువును తీవ్రతరం చేసింది. అదే సమయంలో రాజకీయ వేడిని కూడా పెంచింది. ఈనెల 5న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు కాంగ్రెస్.. సర్కార్ కల్పించిన అనేక అడ్డంకులను అధిగమించి కన్నేపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించారు. గోదావరి నదిలో ప్రవహిస్తున్న లక్ష క్యూసెక్కుల నీటిని చూపించి, ఈ నీటిని ఎత్తిపోసి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాకపోతే తమకు అప్పజెప్తే వారం రోజుల్లో నీటిని ఎత్తిపోసి, రిజర్వాయర్లను నింపి చూపిస్తామని సవాల్ విసిరారు. ఇందుకు సర్కార్ ఒప్పుకోని పక్షంలో వేలాదిమంది రైతులతో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి తామే పంపులను ఆన్ చేస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ బృందం కన్నెపల్లి పంప్ హౌస్ ను సందర్శించడం, ఆ తర్వాత రైతు హెచ్చరికలతో రాష్ట్రంలో మరింత రాజకీయ వేడిని రాజేసింది. బీఆర్ఎస్ సవాల్‌కు కౌంటర్‌గా 6వ తేదీన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ నెపాన్ని ఎన్‌డీఎస్ఏ మీదకు నెట్టి, బరాజ్‌ల మరమ్మతులు పూర్తయ్యేదాకా వాటిల్లో నీటిని నింపే ప్రసక్తే లేదని ప్రకటించారు. 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహచర మంత్రివర్గ సభ్యులతో కలిసి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో అసలు వర్షాలే లేవు, వరదలే లేవు, నీటిని ఎట్లా ఎత్తిపోయాలని సాక్షాత్తు సీఎం ప్రశ్నించారు. ఇది అవగాహనారాహిత్యంతోనా లేదా సమాచారలోపం వలన అన్న మాటనా తెలియదు. గతంలో కూడా సీఎం ఇటువంటి తప్పుడు మాటలు మాట్లాడి సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్‌కు గురైన సందర్భాలు ఉన్నాయి. సీఎం మాటలు ఎంత సత్యదూరమో ప్రతిరోజూ కేంద్ర జల సంఘం నమోదు చేస్తున్న గేజ్ రీడింగ్స్ చూస్తే తెలుస్తుంది[illegible]

నిజానికి ఈనెల 5న కేటీఆర్ పర్యటనలోనే కనిపించిన వాస్తవం అది. మేడిగడ్డ బరాజ్ వద్ద పెద్దఎత్తున ప్రవాహాలు ఈనెల 1వ తేదీ నుంచే నమోదవుతున్నాయి. 8వ తేదీ ఉదయం 9 గంటలకు మేడిగడ్డ వద్ద 1,02,300 క్యూసెక్కులు, సమ్మక్క బరాజ్ వద్ద 1,30,000 క్యూసెక్కులు నమోదైంది. అంటే మేడిగడ్డ నుంచి రోజుకు 2 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకోవడానికి అనుకూలంగా గోదావరిలో ప్రవాహాలు ఉన్నాయి. ప్రభుత్వం మాత్రం ఎన్‌డీఎస్ఏ విధించిన ఆంక్షలను సాకుగా చూపించి ఈ ప్రవాహాలను ఎత్తిపోయలేమని మొండిగా వాదిస్తున్నది. మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా నీటిని నింపకూడదని ఎన్‌డీఎస్ఏ ఆంక్షలు పెట్టిన మాట వాస్తవమే. మూడు బరాజ్‌లు ఒకేరకంగా డిజైన్, నిర్మాణ పద్ధతులు అవలంబించినందున మేడిగడ్డలోని కుంగుబాటు అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా సంభవించే అవకాశాలు ఉంటాయి. కనుక పరీక్షలు జరిపి, అనుమానం నివృత్తి చేసుకున్న తర్వాత లేదా ఏమైనా లోపాలు ఉన్నాయని పరీక్షల్లో నిర్ధారణ అయితే వాటి మరమ్మతులు పూర్తయ్యాకే నీటిని నిల్వ చేయాలని ఎన్‌డీఎస్ఏ భావించింది. అంతేకానీ అక్కడ లోపాలు ఉన్నాయని నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదు. అయితే అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో మేడిగడ్డలో ఉన్నట్టు కట్టడంలో ఎటువంటి కుంగుబాటుగాని, పగుళ్లుకాని లేవు. వాటిలో ఇంజినీర్లు గమనించింది కేవలం బుంగలు మాత్రమే. ఆ బుంగలను 2021లోనే కెమికల్ గ్రౌటింగ్ చేసి పూడ్చేశారు. ఆ తర్వాత అక్కడ మళ్లీ బుంగలు ఏర్పడలేదు. స్వచ్ఛమైన నీరు బయటకు రావడం కనిపించింది. మట్టి, ఇసుక లేకుండా కేవలం స్వచ్ఛమైన నీరు బయటకు రావడం మామూలు విషయం. అదేమీ ప్రమాద సంకేతం కాదు. అన్ని మట్టికట్టల నుంచి ఇటువంటి ఊటలు వస్తాయి. వాటిని మట్టికట్ట కింద కట్టిన కాలువల ద్వారా వాగులోకి పంపిస్తారు. ఆ నీటిలో మట్టి లేకపోతే ఆ ఊటలు రావడంతో మట్టికట్ట సురక్షితంగా ఉన్నదని భావించవచ్చు. అటువంటి ఊటలు రాకపోతేనే మట్టికట్ట కూలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నది. మట్టికట్టలోనే కాదు.. కాంక్రీట్ డ్యామ్‌లలో గోడల నుంచి కూడా నీటిఊటలు వస్తాయి. నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్ లాంటి డ్యామ్‌ల్లో నిర్మించిన గ్యాలరీల్లో వాటిని చూడవచ్చు. ప్రతీరోజు వాటిని సంప్‌లోకి పంపి, అక్కడ నుంచి పంప్ చేసి నదిలోకి వదులుతారు. పరిమితి మించని నీటి ఊటల వల్ల మట్టికట్టలు, కాంక్రీట్ డ్యామ్‌లకు ఏ ప్రమాదమూ వాటిల్లదు. అది సహజమైనదే. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా బుంగలను పూడ్చివేసిన తర్వాత ఇటువంటి స్వచ్ఛమైన నీటి ఊటలే కనిపించాయి. 2023 అక్టోబర్‌లో కుంగుబాటు తర్వాత మూడు బరాజ్‌లను ఫ్రీ ఫ్లో కండిషన్‌లోనే పెట్టారు. ఆ తర్వాత 2024, 2025 లలో భారీ వరదలు సంభవించినప్పుడు మేడిగడ్డ బరాజ్‌లో అదనపు పగుళ్లు కాని, కుంగుబాటు కాని రాలేదు. బరాజ్‌లో నిర్మాణ లోపాలు, డిజైన్ లోపాలు, నాణ్యతాలోపాలు ఉంటే కుంగుబాటు తర్వాత వచ్చిన భారీ వరదలు మొత్తం బరాజ్‌ను నాశనం చేసి ఉండేవి. కాని అట్లా జరుగలేదు. 2023లో ఏమి జరిగిందో అక్కడే ఆగిపోయింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కూడా ఆ వరదలను తట్టుకొని నిలబడ్డాయి. వరదను సురక్షితంగా కిందికి పంపించాయి. గోదావరి నదే మూడు బరాజ్‌లు పటిష్టంగా ఉన్నాయని నిరూపించింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు సురక్షితంగా ఉన్నాయన్న సంగతి ప్రాజెక్టు ఇంజినీర్లకు తెలుసు. వారే 2025లో మేడిగడ్డతో సంబంధం లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ 1ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ఇన్‌టేక్‌కు వంద మీటర్ల దిగువన 96 మీటర్ల ఎత్తుకు ఒక రబ్బర్ డ్యామ్ నిర్మిస్తే నీటిని పంప్‌హౌస్‌లోకి మళ్లించవచ్చు. అక్కడి నుంచి గ్రావిటీ కాలువ ద్వారా అన్నారంనకు, అక్కడ నుంచి సుందిళ్ల, ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోసుకోవచ్చునని ప్రభుత్వానికి నివేదించారు.

ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టులో లింక్ 1ను ఆపరేషన్‌లో పెట్టే ఉద్దేశం లేదు కనుకనే ఆ నివేదికను తొక్కిపెట్టింది. తమ్మిడిహట్టి నుంచి నీటిని ఎల్లంపల్లికి కాకుండా సుందిళ్లకు తరలించాలని ప్లాన్ సిద్ధం చేస్తున్నది. ఆ బరాజ్‌లు సురక్షితం కాకపోతే సుందిళ్లకు తరలించడం దేనికి? అంటే నీటిని ఎత్తిపోయకపోవడానికి ఇప్పుడు ప్రభుత్వం చెప్తున్న కారణాలు సమంజసమైనవి కావని తెలుస్తునే ఉన్నది. 2024, 2025లో భారీ వర్షాలు కురిసినందున శ్రీరామ్‌సాగర్, ఎల్లంపల్లి, కడెం, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, ఇతర జలాశయాల్లో, చెరువుల్లో నిండుగా నీరు లభ్యమైంది. కాబట్టి ప్రభుత్వాన్ని కన్నెపల్లి పంపులను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోయాలని ఎవరూ డిమాండ్ చేయలేదు. ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటికే 42 శాతం లోటు వర్షపాతం నమోదైంది. భూగర్భజలాలు అడుగంటిపోయాయి. సాగునీటికే కాదు, తాగునీటికి కూడా కొరత ఏర్పడిన పరిస్థితి నెలకొన్నది. ఇంతటి కరువులో కూడా మేడిగడ్డ వద్ద వరద ఉధృతి ఉన్నది. నీటి లభ్యత ఇక్కడ మాత్రమే ఉన్నది. కరువు సృష్టించిన ప్రకృతి, ఈ కరువును ఎదుర్కోవడానికి ప్రాణహిత జలాలను తెలంగాణకు కానుకగా ఇచ్చింది. కాబట్టి కరువు నేపథ్యంలో రాబోయే దుర్భిక్ష పరిస్థితులను అధిగమించేందుకు కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి, ఎగువన జలాశయాల్లో నిల్వ చేసుకోవడం తప్ప మరో మార్గం లేదు. ఇందుకు మార్గాలను అన్వేషించాలని తెలంగాణ పౌరసమాజం, ఇంజినీర్లు, రైతులు, ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బరాజ్‌ల నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, అనుభవజ్ఞులైన విశ్రాంత ఇంజినీర్లతో సమాలోచన చేస్తే పరిష్కార మార్గాలు లభిస్తాయి. అదే సమయంలో ఎన్‌డీఎస్ఏకు ఇక్కడి వాస్తవ పరిస్థితులను వివరించి వారి సూచనలను కూడా పొంద వచ్చు. ఇప్పుడు కావలసింది రాజకీయ పరిణతి, విజ్ఞత, ప్రజలు, రైతులకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి మాత్రమే. రాజకీయ క్రీడ ఆడటానికి ఇది సమయమూ కాదు, సందర్భమూ కాదు. మరొక ప్రశ్న కూడా ముందుకు వస్తున్నది. కాళేశ్వరం బరాజ్‌లకు ఉన్న ఆంక్షలు సమ్మక్క బరాజ్‌కు లేవు కదా! అక్కడ ఈ రోజు 1,30,000 క్యూసెక్కుల వరద కిందికి పోతున్నది కదా! ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి కదా! మరి దేవాదుల పంపులు ఆన్ చేయడానికి ప్రభుత్వం ఎందుకు పూనుకోవడం లేదు? రాజకీయ భేషజాలకు పోకుండా కన్నెపల్లి పంపులను, దేవాదుల పంపులను తక్షణమే ఆన్ చేసి, సాగు, తాగు అవసరాల కోసం నీటిని ఎత్తిపోయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. ఆ బాధ్యతను నెరవేరుస్తారా? లేదా గోదావరి జలాలను గోదావరి డెల్టా ఆయకట్టు అవసరాలను తీర్చడానికి వదిలేస్తారా?

ప్రకృతి పగ్గాలు చేజారిపోతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తీవ్రస్థాయి ఎల్‌నినో ముప్పు అంచనాలు నిజమవుతూ, 2026 నైరుతి రుతుపవన సీజన్ దీర్ఘకాలిక సగటులో 90శాతానికి పరిమితం కావచ్చని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. లోటు వర్షపాతం సంభావ్యత సాధారణ 16శాతంతో పోలిస్తే రెండింతలకు పైగా, అంటే 35శాతానికి చేరుకుంది. జూన్ నెలాఖరుకు దేశవ్యాప్తంగా వర్షపాత లోటు 40శాతానికి పైగా నమోదైంది. పసిఫిక్ మహాసముద్రంలో నినో-3.4 సూచీ ఎల్‌నినో పరిమితిని దాటిందని, గత ఏడాది కాలంలో తటస్థ- లానినో తిరిగి తటస్థ పరిస్థితుల మధ్య ఊగిసలాడిన సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఇప్పుడు స్థిరంగా పెరుగుతున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు నిర్ధరించారు. దీనికితోడు, హిందూ మహాసముద్రంలో సానుకూల ద్విధ్రువ పరిస్థితులు ఏర్పడితే ఎల్‌నినో దుష్ప్రభావాన్ని కొంతమేర తగ్గించే వీలుండేది. కానీ ఈసారి తటస్థ ద్విధ్రువ పరిస్థితులే కొనసాగుతాయని అంచనా వేయడంతో, ఆ ఊరటకూడా లేకుండా పోయింది. సోమాలి జెట్‌వంటి రుతుపవన వాహక గాలుల బలం, పశ్చిమ వాతావరణ కల్లోలాల పునరాగమనంవంటి అంశాలు రాబోయే వారాల్లో పరిస్థితిని మెరుగుపరచవచ్చన్న ఆశ ఉన్నా, జూన్‌లో నమోదైన భారీ లోటు వర్షపాతాన్ని పూడ్చుకోవడం అంత సులభం కాదు. ఫలితంగా మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు తీవ్ర ప్రభావిత జాబితాలో చేరాయి. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గుర్తించిన 315 సున్నిత జిల్లాల్లో.. సాగునీటి సదుపాయం అంతంతమాత్రంగా ఉన్న 111 అత్యధిక ప్రాధాన్యత జిల్లాలు ఖరీఫ్ సాగుకు అతిపెద్ద సవాలుగా నిలిచాయి. అమెరికా వాతావరణ సంస్థ నోవా అంచనాల ప్రకారం, ఈ ఎల్‌నినో బలపడుతూ 2026-27 శీతాకాలం వరకు కొనసాగే అవకాశం 96 శాతం ఉంది. సాగు, జీవనోపాధి, ఆహార భద్రతపై దీర్ఘకాలిక ప్రభావం చూపే పరిణామమిది!

దేశ సేద్యరంగంలో దాదాపు 60శాతం వర్షాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరు పండించే పప్పుధాన్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు దేశ పౌష్టికాహార భద్రతకు వెన్నెముక. వర్షపాతం సగటుకంటే తగ్గితే అది కేవలం దిగుబడులను దెబ్బతీయడమే కాకుండా, లక్షలాది రైతు కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తుంది. 2024-25లో దేశం రికార్డుస్థాయిలో 353.96 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేసినప్పటికీ, అంతకుముందు 2021-22 నుంచి ఉత్పత్తిలో హెచ్చుతగ్గుల కారణంగా గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెరపై తాత్కాలిక ఎగుమతి నిషేధాలు విధించాల్సి వచ్చిన అనుభవమింకా మరవలేనిది. ఈ సున్నితమైన సమతూకానికి ఇరాన్ యుద్ధం మరో పెద్ద సవాలుగా మారింది. ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల అంతర్జాతీయ సరఫరా గొలుసులపై దాని ప్రభావం ప్రత్యక్షంగా రైతుల ఉత్పాదక వ్యయాలను పెంచుతోంది. దిగుమతి ఆధారిత ఎరువుల ధరలు పెరిగినకొద్దీ, ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం తగినంత నిల్వ చేసినా, రబీ సీజన్ నాటికి కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే అస్థిర వర్షాలు, ఆలస్యమైన రుతుపవనాలు, ఆకస్మిక వడగాడ్పుల కారణంగా నష్టపోతున్న వర్షాధార రైతులు- ఎరువుల కొరత, పెరిగిన ధరల భారంతో మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే

## కమ్ముతోన్న కరవు!


ప్రమాదముంది. గత ఐదేళ్లలో అత్యధిక వర్షపాతం నమోదైన నెలలు, అత్యంత పొడి వాతావరణం నెలకొన్న నెలలు ఒకదానివెంట ఒకటి రావడం.. సంప్రదాయ రుతు చక్రాలు పూర్తిగా అస్తవ్యస్తమయ్యాయనడానికి నిదర్శనం! ఈ పరిస్థితుల్లో సంప్రదాయ సాగు పద్ధతులను గుడ్డిగా అనుసరించడం క్షేమకరం కాదు. వాతావరణాన్ని తట్టుకునే విత్తనాలను ప్రతి జిల్లాకూ చేరవేయడం, వర్షాధార ప్రాంతాల్లో బహుళ పంటల విధానాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ ఎరువులు- జీవబొగ్గు (బయోచార్) వంటి పద్ధతుల ద్వారా నేల నీటిని నిలుపుకునే సామర్థ్యాన్ని పెంచడంవంటి చర్యలు తక్షణావసరం. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వడం ద్వారానే స్థిరమైన దిగుబడులు సాధ్యం. వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఏ పంట ఎప్పుడు వేయాలో, ఏ మేర నీటి యాజమాన్యం చేపట్టాలో రైతులకు స్పష్టంగా తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

## సంపాదకీయం

ఈ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే నిల్వ మౌలిక సదుపాయాల బలోపేతం అత్యవసరం. దేశంలో వార్షికంగా 330 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతుండగా, శాస్త్రీయ నిల్వ సదుపాయం కేవలం 47శాతం ఉత్పత్తినే కప్పి ఉంచగలుగుతోంది. మిగిలిన 60-70శాతం ధాన్యం సంప్రదాయ గృహ నిల్వ పద్ధతుల్లోనే ఉండటంవల్ల కోతల అనంతర నష్టాలు గణనీయంగా ఉంటున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో నిల్వ సదుపాయం 90శాతానికి పైగా ఉంటే, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌వంటి రాష్ట్రాల్లో అది 50శాతం కన్నా తక్కువ. గ్రామస్థాయి నిల్వ సదుపాయం లేకపోవడం వల్ల రైతులు పంట కోతల వెంటనే మద్దతు ధర కన్నా తక్కువకే అమ్ముకోవాల్సిన దుస్థితి. ఎఫ్‌సీఐ, రాష్ట్ర సంస్థల వద్ద ప్రస్తుతం 917.83 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యమున్నా, అందులో అధిక భాగం మిగులు రాష్ట్రాల్లోని పెద్ద గోదాములకే పరిమితమై, గ్రామీణ ఉత్పత్తిదారులకు దూరంగా ఉండటం ఒక పెద్ద లోపం. దాదాపు 63వేల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) స్థాయిలో గోదాములు నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన "ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్య నిల్వ పథకం" హర్షణీయమే అయినా, దాన్ని మరింత వేగంగా, ముఖ్యంగా లోటు వర్షపాత ముప్పు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ప్రాధాన్యతా ప్రాతిపదికన అమలు చేయాల్సిన అవసరముంది. శీతల గిడ్డంగుల కొరత తీవ్రంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు ఏడువేల శీతల గిడ్డంగుల్లో 60 శాతానికి పైగా కేవలం ఒకటి రెండు రాష్ట్రాలకే పరిమితమవడం పంపిణీలో అసమతుల్యతను చూపిస్తోంది. అందుకే -పంటల బీమా పరిధిని వర్షాధార భూములన్నింటికీ విస్తరించడం, మద్దతు ధరలకు కొనుగోళ్లను పెంచడం, గోదాము రసీదుల ఆధారంగా రైతులకు రుణ సదుపాయం కల్పించడం, వాతావరణ సూచనలను స్థానిక భాషల్లో సకాలంలో అందించడం వంటి చర్యలు సమాంతరంగా జరగాలి. వాతావరణ మార్పు ఇకపై నిత్య వాస్తవం. దాన్ని ఎదుర్కొనేలా విధానాలను, మౌలిక సదుపాయాలను సిద్ధం చేసుకోవడంలో ఆలస్యం చేస్తే, రేపటి ఆహార భద్రతకు నేడే మూల్యం చెల్లించక తప్పదు!!

---

### పనికొచ్చే పలుకు



## నిశ్శబ్దంగా ఎదుగుతున్నట్టే..!

లక్ష్యాలను సాధించలేదనే బాధ, పక్కవారితో పోల్చుకుంటూ వెనుకపడిపోయామనే ఆందోళన చాలామందిని వేధిస్తోంది. ముఖ్యంగా మెట్రో నగరాల్లో ఉండే ఉరుకుల పరుగుల జీవితంలో, తోటివారితో పోలికలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. కానీ, నిజమైన ప్రగతి ఎల్లప్పుడూ అందరికీ కనిపించేలా పెద్ద మైలురాళ్లు లేదా భారీ విజయాల రూపంలోనే ఉండాలని లేదు! మనకు తెలియకుండానే, నిశ్శబ్దంగా సాగిపోయే రోజువారీ క్షణాల్లోనే జీవితం ఎంత నిలకడగా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. మీరు సరైన దిశలోనే ప్రయాణిస్తున్నారా లేదా అనే సందేహం మీలో ఉంటే, మీరు అనుకున్నదానికంటే చాలా మెరుగైన స్థితిలోనే ఉన్నారని చెప్పడానికి కొన్ని కీలకమైన సంకేతాలిక్కడ చూడండి.

బాధ్యతలు, సందేహాలే మీ బలం..: మీ ఈమెయిల్ ఇన్‌బాక్స్ నిండిపోవడం, క్యాలెండర్‌లో పనుల జాబితా ఉండటం, కట్టాల్సిన బిల్లులు సిద్ధంగా ఉండటం ఒక్కోసారి భారంగా అనిపించవచ్చు. అయితే, సమాజం మిమ్మల్ని నమ్ముతోందని, మీపై ఆధారపడుతోందని చెప్పడానికి ఇదే సంకేతం. బాధ్యతలు ఉండటం అంటే మీరు ఇతరుల జీవితాల్లో ప్రాధాన్యత కలిగిన వ్యక్తిగా మారారని అర్థం.

అలాగే, "నేను చేస్తున్న పని సరైనదేనా? ఇంకా బాగా చేయగలనా?" అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవడం మంచి పరిణామం. ఆత్మపరిశీలన అనేది ఒక వ్యక్తి నిరంతరం ఎదగాలని కోరుకుంటున్నాడనడానికి రుజువు. నేర్చుకోవడం ఆపేసిన వారు ఎప్పుడూ తమను తాము ప్రశ్నించుకోరనే నిజాన్ని గ్రహించాలి.

మానసిక స్పష్టత, నచ్చిన పనుల కోసం సమయం..: మీ జీవితంలో ఎక్కడో ఏదో లోపముందని లేదా ఒక విషయం సరిగ్గా సాగడం లేదని మనసుకు అనిపిస్తే, అది మీలో ఉన్న అవగాహనకు నిదర్శనం. ఏది తప్పుగా ఉందో గుర్తించడమే, జీవితాన్ని సానుకూల మార్గంలోకి మళ్లించడానికి పడే మొదటి అడుగు.

ప్రస్తుత బిజీ లైఫ్‌లో మీకు నచ్చిన పుస్తకం చదవడానికో, చిన్న అలవాట్లను కొనసాగించడానికో లేదా వారాంతాల్లో కాస్త ప్రశాంతంగా గడపడానికో సమయం కేటాయిస్తున్నారంటే, మీరు కేవలం బతకడం లేదు.. జీవితాన్ని ఆస్వాదిస్తూ జీవిస్తున్నారని అర్థం.

గతాన్ని చూసి గర్వపడటం.. భవిష్యత్తుపై ఆశ: ఒకప్పుడు "ఈ కష్టంనుంచి ఎలా గట్టెక్కుతాం?" అని భయపడిన రోజులను ఇప్పుడు గుర్తుచేసుకుని ప్రశాంతంగా నవ్వగలుగుతున్నారంటే మీలో అద్భుతమైన మానసిక స్థైర్యం ఉందని అర్థం. మీ గతంలోని చిన్న వర్షన్‌తో పోల్చితే, ఈరోజు మీరు ఎంతో పరిణతి సాధించారు. ఆనాడు మీరు కలలుగన్న కొన్ని క్షణాలను ఈరోజు నిజంగా అనుభవిస్తున్నారు.

"జీవితంలో ఎదుగుదల అనేది రాత్రికి రాత్రి వచ్చే మార్పు కాదు. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, మనకు ఏది సెట్ అవుతుందో తెలుసుకోవడమే నిజమైన వ్యక్తిగత వికాసం" అని మానసిక నిపుణులు చెబుతున్నారు. కొత్త విషయాలను నేర్చుకోవాలనే కుతూహలం ఇంకా మీలో సజీవంగా ఉంటే, మీరు జీవితాన్ని మరింత అనుభవించడానికి సిద్ధంగా ఉన్నారని అర్థం. వచ్చేవారం ప్లాన్ చేసుకోవడం లేదా తదుపరి ట్రిప్ గురించి ఆలోచించడం వంటి చిన్న చిన్న భవిష్యత్తు ప్రణాళికలు కూడా మీలో ఉన్న ఆశావహ దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి.

జీవితం ఎప్పుడూ ఒకేలా సాగదు. ఒడిదొడుకులు ఎదురైనప్పుడు స్థిరంగా నిలబడటం, నమ్మకమైన వ్యక్తులతో బంధాన్ని కలిగి ఉండటం, కొత్త రోజుపై నమ్మకంతో ముందుకు సాగడమే మీరు జీవితంలో అద్భుతంగా రాణిస్తున్నారని చెప్పడానికి అసలైన నిదర్శనాలు.

---

# ఇది.. మనోభావ మాంద్యం!

దేశ ఆర్థిక వృద్ధి గణాంకాల్లో మెరుగ్గా కనిపిస్తున్నా, సామాన్యుడి మనసులో మాత్రం అలజడి రేగుతోంది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన తాజా వినియోగదారుల విశ్వాస సర్వేలో- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వరుసగా మూడోసారి ప్రజల విశ్వాసం క్షీణించింది. ఉద్యోగ భద్రతపై నమ్మకం సన్నగిల్లుతుండగా, ఆదాయ అంచనాలు నీరసిస్తున్నాయి. ఇంతకాలం "ఇవాళ కష్టమైనా రేపు బాగుంటుంది" అనుకునే భారతీయుల ఆశావాదం సైతం ఇప్పుడు బలహీనపడటం ఆందోళన కలిగిస్తోంది. అధికారిక ద్రవ్యోల్బణం అదుపులో ఉందని గణాంకాలు చెబుతున్నా, సామాన్యుడి జేబుకు మాత్రం ధరల మంట తప్పడం లేదు. ఫలితంగా అనవసర ఖర్చులపై చేయి వెనక్కి లాక్కుంటున్న ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. దేశ జీడీపీలో అరవై శాతానికి పైగా వాటా వినియోగానిదే అయినప్పుడు, ఈ మనోభావ మాంద్యాన్ని విధానకర్తలు తేలిగ్గా తీసుకోకూడదు!





ప్రతి రెండు నెలలకోసారి రిజర్వ్ బ్యాంక్ దేశవ్యాప్తంగా వేలాది కుటుంబాలను కొన్ని సాధారణ ప్రశ్నలు అడుగుతుంది.. మీ ఆర్థిక పరిస్థితి ఏడాది క్రితం కన్నా మెరుగ్గా ఉందా, దిగజారిందా? మీ ఉద్యోగం ఎంత భద్రంగా ఉంది? ధరలు ఎంత వేగంగా పెరుగుతున్నాయి? మీ ఖర్చు అలవాట్లు ఎలా మారుతున్నాయి? జీడీపీ వృద్ధి రేటు, ద్రవ్యోల్బణం గణాంకాలంత హడావిడిగా వార్తలకెక్కకపోయినా, ఈ సర్వే ఫలితాలు దేశ ఆర్థిక నాడిని పసిగట్టడంలో కీలకమైనవి. 2026 మే నెలలో నిర్వహించిన తాజా రౌండ్ ఫలితాలు మాత్రం సాధారణం కాదు.. అవి తక్షణ శ్రద్ధ అవసరమని చాటిచెబుతున్నాయి! 19 నగరాల్లో నిర్వహించిన పట్టణ వినియోగదారుల విశ్వాస సర్వేలో, ప్రస్తుత పరిస్థితి సూచీ వరుసగా మూడోసారి క్షీణించి 95.7 నుంచి 90.7కు పడిపోయింది. వందకంటే తక్కువ నమోదైతే అది నిరాశావాద ధోరణికి సంకేతం. కేవలం ఒక్క రౌండ్‌లో పరిస్థితి "దిగజారింద"ని చెప్పిన కుటుంబాల శాతం 47.7శాతానికి చేరగా, "మెరుగైంద"ని చెప్పింది కేవలం 31.2శాతమే. దాదాపు 9వేల కుటుంబాలను కలుపుకున్న గ్రామీణ సర్వేలోనూ ఇదే ధోరణి ప్రతిబింబించింది. ప్రస్తుత పరిస్థితి సూచీ 95.2కు పడిపోగా, ఆర్థిక పరిస్థితిపై నికర స్పందన 2025 మే తర్వాత తొలిసారి రుణాత్మకంగా (మైనస్ 2.5) మారింది. 2025 మొత్తం స్థిరంగా ఉన్న ఉపాధి అంచనాలు సైతం ఇప్పుడు ప్రతికూలంగా మారడం గమనార్హం. అంతకన్నా ఆందోళనకరమైన అంశం.. భవిష్యత్‌పై ఆశావాదం సన్నగిల్లుతుండటం. నేటిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే రేపటిపై ఆశ పెంచుకోవడం భారతీయ వినియోగదారుల సర్వేల్లో కనిపించే ఒక సాధారణ లక్షణం. ఈ అంతరమే వినియోగ డిమాండ్‌కు నిశ్శబ్ద బలంగా నిలిచింది. కానీ ఇప్పుడు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రెండింటిలోనూ ఆ అంతరం కుంచించుకుపోతోంది. పట్టణ భవిష్యత్ అంచనాల సూచీ 118.7కు పడిపోయి 2023 సెప్టెంబరు తర్వాత అత్యల్ప స్థాయికి చేరగా, గ్రామీణ అంచనాల సూచీ జనవరిలో 129.3 నుంచి మేలో 119.3కు గణనీయంగా తగ్గింది.

ఈ మనోభావ క్షీణతను కేవలం సర్వే గణాంకాలుగా కొట్టిపారేయలేని కారణం ఒకటుంది; భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో వినియోగానికి అత్యంత కీలక పాత్ర ఉంది. తాజా ఆర్థిక సర్వే ప్రకారం, 2025-26లో వ్యక్తిగత తుది వినియోగ వ్యయం (పీఎఫ్‌సీఈ) జీడీపీలో 61.5శాతానికి చేరింది- ఇది 2011-12 తర్వాత అత్యధిక స్థాయి. అంటే, దేశ వృద్ధి ఇంజిన్‌లో ప్రజల జేబులోంచి వచ్చే ఖర్చే అతిపెద్ద చోదకశక్తి. కానీ ఇప్పుడు అదే ప్రజలు విచక్షణాధీన ఖర్చులపై చేయి వెనక్కి లాక్కుంటున్నారు. పట్టణ కుటుంబాల్లో అనవసర ఖర్చులపై సెంటిమెంట్ మార్చిలో 21.1గా ఉంటే మేకి కేవలం 15.9కే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే ధోరణి కనిపించి, నికర స్పందన 59.5 నుంచి 42.6కు ఒక్క రౌండ్‌లోనే పడిపోయింది. ఇది వినియోగ వస్తువులు, రిటైల్, సేవల రంగాలపై ప్రత్యక్ష ప్రభావం చూపే పరిణామం. దీనికితోడు ఒక విచిత్రమైన వైరుధ్యం కూడా బయటపడింది. అధికారిక రిటైల్ ద్రవ్యోల్బణం 2025-26లో సగటున 1.7శాతానికే పరిమితమై చాలా తక్కువగా ఉన్నా, ప్రజల అనుభవంలో ధరల భారం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. గ్రామీణ ప్రతివాదుల ప్రస్తుత ద్రవ్యోల్బణ అంచనా మేలో 5.9శాతానికి చేరి, మార్చితో పోలిస్తే 30 బేసిస్ పాయింట్లు పెరిగింది. రాబోయే ఏడాదికి వారి అంచనా ఏకంగా 7.2శాతానికి ఎగబాకింది. గణాంకాలు కొలిచేదానికి, కుటుంబాలు దుకాణంలో అనుభవించేదానికి మధ్య ఈ అంతరం కొత్తదేమీ కాదు. కానీ ఇది ఖర్చు, పొదుపు నిర్ణయాలను నేరుగా ప్రభావితం చేస్తుంది కాబట్టి దీన్ని విస్మరించలేం! ధరలు ఏడు శాతానికి పైగా పెరుగుతాయని నమ్మే వినియోగదారుడు, ద్రవ్యోల్బణం అదుపులో ఉందని విశ్వసించే వినియోగదారుడితో పోలిస్తే పూర్తి భిన్నంగా వ్యవహరిస్తాడు- అధికారిక సూచీ ఏం చెప్పినా సరే.

ఈ పరిణామాలన్నింటినీ ఒకచోట చేర్చి చూస్తే కనిపించేది- ఏదో ఒక్క సూచీలో మందగమనం కాదు, భావోద్వేగ స్థాయిలోనే నెలకొన్న అనిశ్చితి. ఇది చివరికి కొనుగోలు నిర్ణయాలుగా, పెద్ద వ్యయాలుగా, రుణం తీసుకునే ధైర్యంగా మారే అంతర్గత చోదకశక్తి. ఇలాంటి సర్వేలు కేవలం మనోభావాన్ని పట్టిస్తాయి తప్ప, వాస్తవ లావాదేవీలను కాదని, మనోభావాలు అస్థిరంగా ఉంటాయని వాదించవచ్చు. కానీ గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండూ వరుసగా మూడో రౌండ్‌లో బలహీనమైన విశ్వాసాన్ని నివేదించినప్పుడు, భవిష్యత్ అంచనాలు వర్తమాన అవగాహనతో పాటే జారిపోతున్నప్పుడు, రెండు వర్గాల్లోనూ విచక్షణాధీన వ్యయ సంకల్పం మందగిస్తున్నప్పుడు- దీన్ని కేవలం సాధారణ అంశంగా కొట్టిపారేయలేం, ఒక సంకేతంగానే పరిగణించాలి! భారత వృద్ధి కథ ప్రధానంగా దేశీయ వినియోగంపైనే ఆధారపడి ఉంది, ఆ వినియోగం విశ్వాసంపైనే నిలబడుతుంది. సరిగ్గా ఇందుకోసమే రిజర్వ్ బ్యాంక్ ఈ సర్వేలను నిధులతో నిర్వహించి ప్రచురిస్తోంది- ఇవి ఒక ముందస్తు హెచ్చరిక వ్యవస్థగా పనిచేస్తాయి. కాగితంపై ఆర్థిక వ్యవస్థ ఎంత వేగంగా వృద్ధి చెందుతోందన్న దానికన్నా, సామాన్య భారతీయుడు తన ఆర్థిక భవిష్యత్తుపై ఎంత నమ్మకంతో ఉన్నాడన్న దానిపైనే విధానకర్తలు దృష్టి సారించాల్సిన సమయమిది. ధరల అవగాహన అంతరాన్ని పూడ్చే కమ్యూనికేషన్ వ్యూహాలు, గ్రామీణ ఆదాయ మద్దతు చర్యలు, ఉపాధి భద్రతపై విశ్వాసం పెంచే విధానాలు- వీటిపై శ్రద్ధ పెట్టకుండా, కేవలం స్థూల గణాంకాల ఆధారంగా వృద్ధిని వేడుక చేసుకోవడం అర్ధసత్యమే అవుతుంది. నగరంలో, పల్లెలో- రెండుచోట్లా ప్రజల నమ్మకాన్ని పునర్నిర్మించుకోవడమే నిజమైన ఆర్థిక పురోగతికి పునాది! ■

---




చాలామంది కేవలం నెలజీతాన్ని బట్టే ఆర్థిక విజయాన్ని అంచనా వేస్తారు. కానీ, నిజమైన ధనవంతులు తాము సంపాదించిన ఆస్తులు, పెట్టుబడుల ఆధారంగా విజయాన్ని కొలుస్తారు. నెలజీతం మీ ఖర్చులను తీర్చి, స్థిరత్వాన్ని మాత్రమే ఇవ్వగలదు. పూర్తి స్వేచ్ఛను ఇవ్వలేదు. పెట్టుబడులు, వ్యాపారాల ద్వారా వచ్చే ఆదాయం అలా కాదు. మీరు నిద్రిస్తున్నా, పని చేయకపోయినా మీ సంపద పెంచుతూనే ఉంటుంది. కాబట్టి సంపాదనలో కనీసం 10-30 శాతం భవిష్యత్తు కోసం పెట్టుబడి పెట్టండి. ఒక్కసారి కష్టపడి నిర్మించుకున్న పెట్టుబడుల వ్యవస్థ- కాలం గడిచేకొద్దీ మీ తరఫున నిరంతరం శ్రమిస్తూనే ఉంటుంది. అందుకే, -మీ డబ్బు కూడా మీ కోసం పనిచేసేలా ఈరోజే తొలి అడుగు వేయండి!

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## కొండను కొట్టిన స్టేషన్!



చైనాలోని చాంగ్‌కింగ్ నగరంలో ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌ను కేవలం 38 నెలల్లో నిర్మించి అబ్బురపరిచారు. 1.22 మిలియన్ చదరపు మీటర్ల విస్తీర్ణంలో- సుమారు 170 ఫుట్‌బాల్ మైదానాలంత పెద్దదిగా నిర్మించిన ఈ 'చాంగ్‌కింగ్ ఈస్ట్' స్టేషన్, న్యూయార్క్ గ్రాండ్ సెంట్రల్ కన్నా ఆరు రెట్లు, వాటికన్ సిటీ కన్నా రెండింతలు పెద్దది. 29 ప్లాట్‌ఫారాలు, 15 రైలు మార్గాలు, ఎనిమిది అంతస్తులు, 16,500 టన్నుల ఉక్కు పైకప్పుతో ఇది గంటకు 16వేల మంది ప్రయాణికులను నిర్వహించగలదు. కొండ ప్రాంతంలో నిర్మించిన ఈ స్టేషన్ కోసం మొదట పర్వతాన్ని పేల్చి చదును చేశారు. 40వేల మంది కార్మికులు, రోబోటిక్ యంత్రాలు కలిసి 20 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు, 3.66 లక్షల టన్నుల ఉక్కుతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. వారేవా చైనా అనిపిస్తోంది కదూ!

# అక్తర్ రికార్డు బద్దలు కొడుతా'.. భారత రైజింగ్ స్టార్ శపథం



గుజరాత్ టైటాన్స్ పేసర్ అశోక్ శర్మ పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ ప్రపంచ రికార్డును బద్దలు కొడుతానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 161.3 కిమీవేగంతో అక్తర్ విసిరిన బంతి ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. తాజాగా అక్తర్ రికార్డును తాను బద్దలు కొడుతానంటూ అశోక్ శర్మ శపథం చేయడం గమనార్హం. ఏదోఒక రోజు అక్తర్ రికార్డును బద్దలు కొట్టే సత్తా తనకు ఉందని ధీమా వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన అశోక్ శర్మ ఒక మ్యాచ్‌లో 154.2 కిలోమీటర్ వేగంతో (గంటకు 95.8 మైళ్ల వేగం) బంతి విసిరి ఐపీఎల్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ డెలివరీతో రికార్డు సృష్టించాడు. అంతకముందు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025 సీజన్‌లో 22 వికెట్లు తీయడమే గాక ప్రతీ మ్యాచ్‌లో దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో స్థిరంగా బంతులు వేయడం విశేషం. ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశోక్ శర్మ మాట్లాడుతూ.. 'ఏదో ఒకరోజు అక్తర్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాలనే సంకల్పంతోనే ఉన్నా. బౌలింగ్ వేగం విషయంలో మాత్రం ఎన్నటికీ రాజీపడను. నా దృష్టి ఎప్పుడు బౌలింగ్‌ను మెరుగుపరుచుకోవడంపైనే ఉంటుంది.

అంతా సవ్యంగా సాగితే, బహుశా ఒకరోజు అక్తర్ నెలకొల్పిన 161 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలుగుతానేమో. ఈ క్రమంలో నన్ను నేను మెరుగుపరచుకునేందుకు మరింత కష్టపడుతాను. అయితే నా బౌలింగ్‌ను మెరుగుపరచుకునే క్రమంలో ఆరోగ్యకరమైన పోటీ ఉండడాన్ని ఇష్టపడుతాను.' అని చెప్పుకొచ్చాడు. ఇక జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ఎంపికైన అశోక్ శర్మకు తుది జట్టులో అవకాశం లభిస్తుందా? లేదా? అనేది పక్కనబెడితే ఐపీఎల్ ప్రదర్శనతో పాటు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ప్రదర్శనను పరిగణలోకి తీసుకొని ఎంపిక చేశారు. అయితే ఇండియా-ఏ జట్టు తరఫున అరంగేట్రం చేసినప్పటికీ పెద్దగా రాణించలేదు. ఒక వన్డే మ్యాచ్‌లో 75 పరుగులిచ్చి ఒక వికెట్ మాత్రమే తీశాడు. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆరు మ్యాచ్‌లాడిన అశోక్ శర్మ ఆరు వికెట్లు మాత్రమే తీశాడు. అయితే ప్రతీ జట్టుకు పేస్ బౌలర్లు ఆస్తిలాంటి వారు. జమ్మూ కశ్మీర్ సంచలనం ఉమ్రాన్ మాలిక్ ఐపీఎల్ 2022లో సంచలన ప్రదర్శనతో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. 2023లో వన్డేలు, టీ20ల్లో ఆడినప్పటికీ ఎక్కువకాలం జట్టులో కొనసాగలేకపోయాడు. తన వేగం బలమైనప్పటికీ దానిని నిలకడగా కొనసాగించడంలో విఫలమయ్యాడు. దీనికి తోడు తరచూ గాయాల బారీన పడడం కూడా అతడిని జట్టుకు దూరం చేసింది. మరి అశోక్ శర్మ ఏ మేరకు రాణిస్తాడనేది చూడాలి. ఒకవేళ టీమిండియాలో అవకాశం ఇవ్వాలనుకుంటే అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, బుమ్రా వంటి స్టార్ పేసర్లకు పని భారాన్ని తగ్గించే క్రమంలో అశోక్ శర్మ ఉపయోగపడగలడు. బుమ్రా ఒక్కడే టీమిండియా పేస్ బారాన్ని మోస్తున్న తరుణంలో అశోక్ శర్మ లాంటి యువ బౌలర్ల అవసరం టీమిండియాకు ఎంతో ఉంది.

**చెక్కుచెదరని అక్తర్ రికార్డు**

2003 వన్డే ప్రపంచకప్‌లో రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ అత్యంత ఫాస్టెస్ట్ బంతిని విసిరాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో నిక్ నైట్‌కు (గంటకు 161.3 కిలోమీటర్ వేగంతో) బంతిని విసిరాడు. గంటకు 100 మైళ్ల వేగంతో విసిరడంతో అక్తర్ పేరు క్రికెట్ పుస్తకాల్లో నిలిచిపోయింది. ఇప్పటికీ ఆ రికార్డు చెక్కుచెదరకుండా ఉంది. ఆసీస్ స్పీడస్టర్లు బ్రెట్ లీ, షాన్ టైట్‌లు అక్తర్ రికార్డుకు సమీప దూరంలో నిలిచిపోయారు. బ్రెట్ లీ ఒక మ్యాచ్‌లో గంటకు 161.1 కిలోమీటర్ల వేగం నమోదు చేయగా, షాన్ టైట్ రెండుసార్లు (2005, 2010) అక్తర్ రికార్డుకు దగ్గరగా వచ్చాడు. 2005లో గంటకు 160.7 కిలోమీటర్ల వేగంతో విసరగా, 2010లో గంటకు 161.1 కిలోమీటర్ వేగంతో విసిరాడు.

## స్పోర్ట్స్

### కొలంబియా షూటౌట్.. క్వార్టర్స్‌లోకి స్విట్జర్లాండ్



**వాంకోవర్:** ఫిఫా వరల్డ్‌కప్‌లో మంగళవారం మరో మ్యాచ్ ఉత్కంఠంగా జరిగింది. స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్ ఆధారంగా కొలంబియాపై విజయాన్ని నమోదు చేసింది. 4-3 గోల్స్ తేడాతో షూటౌట్‌లో స్విస్ నెగ్గింది. తొలుత ఇరు జట్ల మధ్య రౌండ్16 మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎక్స్‌ట్రా టైంలో కూడా రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే పెనాల్టీ షూటౌట్‌లో మాత్రం స్విస్‌కు కలిసి వచ్చింది. కీలకమైన నిర్ణయాత్మక పెనాల్టీని రూబెన్ వర్గాస్ గోల్‌గా మలచడంతో స్విట్జర్లాండ్ బృందంలో సంబరాలు మొదలయ్యాయి. కొలంబియాపై 4-3 తేడాతో షూటౌట్‌లో నెగ్గిన స్విట్జర్లాండ్.. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్నది. మిస్సోరీలోని కన్సాస్ సిటీలో శనివారం ఈ మ్యాచ్ జరగనున్నది. ఫిఫా వరల్డ్‌కప్‌లో 1954 నుంచి ఇప్పటి వరకు స్విట్జర్లాండ్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించలేదు. వరల్డ్‌కప్‌లో రెండు గోల్స్ కొట్టిన స్విస్ ప్లేయర్ వర్గాస్ ఈ మ్యాచ్‌లో స్టాపేజ్ టైంలో ఎంట్రీ ఇచ్చాడు. కొలంబియా ప్లేయర్లు డేవిన్‌సన్ సాంచేజ్, కూచో హెర్నాండేజ్ .. షూటౌట్‌లో విఫలం అయ్యారు. దీంతో స్విట్జర్లాండ్ విక్టరీకి మార్గం ఈజీ అయ్యింది. వాస్తవానికి స్విట్జర్లాండ్ జట్టులో కీలక ప్లేయర్ అయిన జోహన్ మన్‌జంబీ.. మోకాలి గాయం వల్ల ఈ మ్యాచ్‌లో ఆడలేదు. అటాక్ ప్లేయర్ లేకపోవడంతో స్విస్ తీవ్ర ఇబ్బందులు పడింది.



# నేచురల్ గ్లామ్ ఓవర్‌లోడ్... అనంతికా లేటెస్ట్ ఫోటోలు ట్రెండింగ్!



సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో తన సహజమైన నటనతో, క్యూట్ లుక్స్‌తో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది యంగ్ బ్యూటీ అనంతికా శనిల్‌కుమార్. ఇటీవల తెలుగులో వచ్చిన '8 వసంతాలు' సినిమాతో పాటు తమిళ చిత్రం 'పరిమళ అండ్ కో'తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ కేరళ కుట్టి, తాజాగా ప్రకృతి ఒడిలో చేసిన ఒక ఫోటోషూట్ నెట్టింట బాగా ట్రెండ్ అవుతోంది. సాంప్రదాయ ఆలివ్ గ్రీన్ చీరలో, ఎలాంటి హంగామా లేని నేచురల్ గ్లామ్‌తో అనంతికా ఒలికించిన హావభావాలు కుర్రకారు మనసులను దోచుకుంటున్నాయి.

**ప్రకృతి ఒడిలో అనంతికా సొగసులు:**
ఈ సరికొత్త ఔట్‌డోర్ ఫోటోషూట్‌లో అనంతికా చుట్టూ పచ్చటి చెట్లు, ప్రకృతి అందాల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ఇక ఒక అందమైన దారిపై నడుస్తూ, పెదవులపై చెరగని చిరునవ్వుతో ఆమె ఇచ్చిన పోజులు చూసేవారికి ఫుల్ పాజిటివ్ వైబ్స్ ఇస్తున్నాయి. ఈ ఫోటోలలో ఆమె సింప్లిసిటీనే అందరికీ బాగా నచ్చేస్తోంది.

**ఆలివ్ గ్రీన్ చీరలో మోడ్రన్ టచ్:**
ఈ షూట్ కోసం అనంతికా ఎంచుకున్న డ్రెస్సింగ్ స్టైల్ చాలా సింపుల్‌గా, క్లాసీగా ఉంది. ఆమె కట్టుకున్న ఆలివ్ గ్రీన్ కలర్ హ్యాండ్లూమ్ లేదా బ్లాక్-ప్రింటెడ్ కాటన్ చీరపై ఉన్న చిన్న చిన్న ఎత్నిక్ డిజైన్లు చాలా బాగున్నాయి. ఇక దీనికి కాంబినేషన్‌గా వేసుకున్న ప్లెయిన్ బ్లాక్ స్లీవ్‌లెస్ బ్లౌజ్, డీప్ స్కూప్ నెక్ లైన్ ఆమె లుక్‌కి ఒక మోడ్రన్ టచ్ ఇచ్చింది.



**నో-మేకప్ లుక్.. మురిపిస్తున్న నవ్వు:**
ఈ ఫోటోషూట్‌కి అసలైన హైలైట్ ఏంటంటే, అనంతికా అసలు భారీ మేకప్ జోలికే వెళ్లలేదు. చాలా మినిమల్ మేకప్, సింపుల్ హెయిర్‌స్టైల్ మరియు ఎలాంటి భారీ ఆభరణాలు లేకుండా కేవలం చిన్న చిన్న జ్యువెలరీతోనే మెరిసిపోయింది. "అచ్చమైన పల్లెటూరి పిల్లను చూసినట్టు ఉందంటూ" నెటిజన్లు ఈ ఫోటోలకు హార్ట్ ఎమోజీలతో లైకుల వర్షం కురిపిస్తున్నారు.

**మలయాళం టు టాలీవుడ్ జర్నీ:**
మలయాళ సినిమాతో కెరీర్ స్టార్ట్ చేసిన అనంతికా శనిల్‌కుమార్, చాలా తక్కువ టైమ్‌లోనే సౌత్ మేకర్స్ దృష్టిలో పడింది. ఇక తన ఎక్స్‌ప్రెసివ్ కళ్లతో, సహజమైన యాక్టింగ్‌తో ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ ఎంచుకుంటూ ఇండస్ట్రీలో ప్రామిసింగ్ హీరోయిన్‌గా ఎదుగుతోంది .సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియా ద్వారా అభిమానులకు ఎప్పుడూ టచ్‌లో ఉంటుంది అనంతికా. ప్రకృతిని ఎంతగానో ప్రేమించే ఈ బ్యూటీ, తన మనసుకు నచ్చిన లొకేషన్లలో ఇలాంటి క్యూట్ ఫోటోషూట్స్ చేస్తూ నెటిజన్లను సర్ప్రైజ్ చేస్తోంది. మరిన్ని వైవిధ్యమైన ప్రాజెక్టులతో ఈ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ ముున్ముందు మరెన్నో విజయాలు అందుకోవాలని ఆశిద్దాం..

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com